

- ఓట్ల కొనుగోళ్లు ప్రారంభం
- నగదు పంపకాల్లో పార్టీల నాయకులు
- ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలతో పంపిణీ
- ప్రాంతాలను బట్టి రూ.1,500 నుంచి రూ.3 వేలు

ఓటుకు.. నోటు

ఓటు.. నోటు.. వల.. ఇదీ ఎన్నికల పంథాగా మారింది. ప్రచారాల్లో నిమగ్నమైన నేతలు పోలింగ్ సమీపిస్తోన్న దశలో నోట్ల పంపకానికి సిద్ధమయ్యా రు. ప్రచారాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటి వరకు ప్రయత్నిం చిన ప్రధాన రాజకీయ పార్టీలు నగదు పంపకానికి తెరలేపాయి. ప్రచారానికి తెర పడక ముందే ప్రలోభాల పర్వానికి రాజకీయ పార్టీలు తెరలేపాయి. ప్రతీ ఓటరు కు డబ్బు చేరేలా పకడ్బందీగా ప్రణాళిక రూపొందిం చుకుని అమలు చేస్తున్నారు. వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు గస్తీ తిరుగుతు న్నా వాటి కళ్లు గప్పి నగదు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం అభ్యర్థులు ప్రత్యేక బృందాలను నియమించుకుని పర్యవేక్షిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో గురువారం నుంచే నగదు పంపిణీ చేపట్టగా శుక్రవారానికి తారస్థాయికి చేరింది. ఓట్ల కొనుగోలుకు సాంకేతికతను కూడా కొందరు అభ్యర్థులు వినియోగిస్తున్నారు.

నియోజక వర్గానికి రూ.40 కోట్లు

బాపట్ల జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి కనీసం రూ.40 కోట్లు పంచేలా ప్రణాళికలు రచించారు. ఈ మొత్తం రూ.60 కోట్ల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాపట్లలో అధికారపార్టీ అభ్యర్థి తరఫున ఓటుకు రూ.1,500 పంచుతున్నట్లు సమాచారం. అద్దంకి, పర్చూరు లాంటి నియోజకవర్గాల్లో ఈ మొత్తం రూ.2,000గా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీ ఎంత డబ్బు పంచుతుందనే అంశంపై దృష్టి పెట్టి వారిచ్చిన దాని కంటే ఎక్కువ మొత్తం ప్రత్యర్థి ఇస్తున్నారని తెలిస్తే అప్పటికప్పుడే డబ్బు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. అద్దంకి, పర్చూరు, రేపల్లె లాంటి చోట్ల డబ్బు పంపిణీపై తాడేపల్లి పెద్దలు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

పల్నాడులో రూ.450 కోట్లు ఖర్చు?

పల్నాడు జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఓట్ల కొనుగోళ్ల ప్రారం భమయ్యాయి. గురువారం రాత్రి నుంచి ఈ ప్రక్రియ ఊపందుకుంది. ఓట్ల కొనుగోలుకు జిల్లాలో రూ.450 కోట్ల వరకు ఖర్చు అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటు రేటు రూ.3 వేలు పలికింది. రెండు నియోజకవర్గాల్లో ఇరు పార్టీలు ఓటుకు రూ.1,500గా రేటు నిర్ణయించి పంపిణీ చేస్తున్నారు. అయితే పట్టణంలో రూ.1500 చెల్లిస్తుండగా మరో నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరో నియోజకవర్గంలో పట్టణ ఓటర్లకు ఇరుపార్టీలు రూ.2,500, గ్రామాల్లో రూ.2 వేలు అందజేస్తున్నట్లు సమాచారం. అరాచకాల అడ్డాగా ఉన్న నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి గ్రామాల్లో రూ.3 వేలుకు, పట్టణంలో ఇంకా ఎక్కువ రేటుకే ఓట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రత్యర్థి మాత్రం గ్రామం, పట్టణం అన్న తేడా లేకుండా రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఓ ప్రధాన నియోజకవర్గంలో ఇరు పార్టీలు రూ.2 వేలు చెల్లిస్తుం డగా, ఓ అభ్యర్థి ఓటు కార్డు స్కాన్‌తో నగదు అందిస్తున్నట్లు తెలిసింది. ఒకే సామా జికవర్గానికి చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్న ఓనియోజకవర్గంలో ఓటుకు రూ.3వేలు చెల్లిస్తున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. మరో నియోజకవర్గంలో ఓటుకు ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు రెండేసి వేలు చెల్లిస్తున్నారు.

తక్కువగా గుంటూరు తూర్పులో రూ.వెయ్యి

పోలింగ్ తేదీ సమీపించడంతో గుంటూరు జిల్లాలోని ఓటర్లను ఆకట్టుకునేందుకు నగదు పంపిణీ గురువారం నుంచే ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గంలో ఓటుకు రూ.2,500 చొప్పున పంచుతున్నారు. వైసీపీ నేతలు పట్టణంలో రూ.2,500, గ్రామాల్లో రూ.1,500ల నుంచి రూ.2వేల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో రూ.1,500 చొప్పున ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. గుంటూరు తూర్పులో ఓటరుకు రూ.వెయ్యి చొప్పున ఇరుపార్టీల తరుపున పంపకాలు మొదలయ్యాయి. పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం వైసీపీ రూ.2 వేలు పం పిణీ చేసినట్లు సమాచారం. తెనాలిలో రూ.1500 వరకు ఓటుకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

(గుంటూరు, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికల్లో ప్రచారం ముగిశాక డబ్బు పంపిణీ చేపట్టేవారు. అయితే ఈ సారి దీనిని మార్చి వేశారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగుస్తుంది. అప్పటికల్లా డబ్బు పంపిణీ పూర్తి చేసేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రచారం ముగిశాక తనిఖీలు జరగవచ్చన్న అంచనాతో ధనం పంపిణీలో నాయకులు జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో గురువారం నుంచే డబ్బు పంపిణీని ప్రారంభించారు. పలు నియోజకవర్గాల్లో శుక్రవారం నగదు పంపిణీ విస్తృతంగా జరిగింది. ఎన్నికల యంత్రాంగం తనిఖీలు నిర్వహించే లోపే డబ్బు పంపి ణీ పూర్తి చేయాలనే ఆలోచనలో నేతలు ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కొక్క విధానంలో ఓటర్ల కొనుగోళ్లు జరుగుతున్నట్లు సమాచారం. నియోజక వర్గంలో 1.50 లక్షల నుంచి 2 లక్షల చొప్పున ఓటర్ల ను కొనుగోలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బును సిద్ధం చేసుకుని పంపిణీ చేస్తున్నారు. ఒక పార్టీ సానుభూతి పరుల ఓట్లను మరో పార్టీ కొనుగోలు చేయడంలేదు. ఈ మేరకు ఓటర్ల జాబితాల్లో సదరు పేర్లను గుర్తించి కొనుగోళ్లు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులు కూడా ప్రత్యేకంగా పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం కల్లా ఓట్ల కొనుగోలును పూర్తి చేసుకునేలా ప్రణాళికను రూపొం దించుకున్నారు. డబ్బు పంపిణీ పూర్త చేసుకుంటేనే మరో వైపు పోలింగ్ వ్యూహాన్ని అభ్యర్థులు రూపొం దించుకుంటున్నారు. ఎంత డబ్బు పంపిణీ చేసినా పోలింగ్ రోజున పై చేయి సాధించకపోతే ప్రతికూల ఫలితాన్ని చూడాల్సి వస్తుందన్న అభిప్రాయంతో అభ్యర్థులు డబ్బు పంపిణీని వీలైనంత త్వరగా ముగించేందుకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి డబ్బులు పంపిణీ ప్రారంభమైనా పోలీసుల నుంచి మొక్కుబడి తనిఖీలు తప్పితే పంపిణీని కట్టడి చేయాలనే చిత్తశుద్ధి లేకుండా పోయింది. దీనికితోడు కొంతమంది పోలీసులు, అధికారులు పాలకపార్టీకి అండగా ఉండటంతో పంపిణీలో వైసీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారని సమాచారం.

మీ డబ్బు మాకొద్దు

ఈ దఫా మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టి కొనసాగించారు. సొంత నిధులు ఖర్చు చేసి పలువురికి ఆర్థికసాయం అందించారు. ఉపాధి అవకాశాలు కల్పించారు. దీంతో అక్కడ టీడీపీకి భారీ మెజార్టీ ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. అయితే తొలుత లోకేశ్‌ను ఓడించాలని వైసీపీ శతవిధాలా ప్రయత్నాలు చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించి లోకేశ్‌కు వచ్చే మెజార్టీని అయినా తగ్గించాలని ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో భారీగా డబ్బు పంపిణీ ద్వారా ఓటర్లకు గాలం వేస్తున్నది. ఒక్కో ఓటరుకు రూ.3 వేలు చొప్పున గడపగడపకు ఆ పార్టీ కార్యకర్తలు వెళ్లి గురువారం నుంచి పంచడం ప్రారంభించారు. అయితే చాలామంది ఓటర్లు మీ డబ్బు మాకు అవసరం లేదు.. మాకు లోకేశ్ ద్వారా ఎంతో మే లు జరిగిందని ముఖానే చెప్పి తలుపులు మూసేస్తున్నారు.

పదివేలు ఇస్తారట.. తీసుకుని సైకిల్‌కి ఓటేయండి

మంగళగిరిలో జగన్ డబ్బును ఏరులై పారిస్తున్నాడు. ఓట్ల కొనుగోలుకు రూ.300 కోట్లను కేటాయించారు. అదంతా పాపపు సొమ్మే! ఇసుక, మద్యం, గంజాయిలో అడ్డగోలుగా దోచుకున్న డబ్బది. ఓటుకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఏం ఫర్వాలేదు.. ఓటర్లు నిరభ్యంతరంగా ఆ డబ్బును తీసుకోవచ్చు. అదంతా జనం నుంచి దోచుకున్న డబ్బే. ఐదేళ్లుగా ఒక్కో ఓటరు నుంచి జగన్ లక్ష రూపాయల వంతున దోచుకుని ఇపుడు ఆ సొమ్ములో పదో వంతును మళ్లీ మీకే ఇస్తున్నాడు. ఆ డబ్బును ఓటర్లు తీసుకుని ఓటుమాత్రం రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించే తమకే అంటే సైకిల్ గుర్తుపైనే వేయాలి.

- ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు



మాచర్ల సభకు హాజరైన జనసందోహం

- జనసంద్రంలా ప్రజాగళం
- వర్షంతో సభకు రాలేకపోయిన చంద్రబాబు
- ఒంగోలు నుంచి ఆన్‌లైన్‌లో ప్రసంగించిన అధినేత

మాచర్ల.. మార్మోగింది

మాచర్ల టౌన్/నరసరావుపేట మే 10 (ఆంధ్రజ్యోతి): జనం.. జనం.. మాచర్ల జన సంద్రమైంది. ఎటుచూసినా జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం. జయజయధ్వానాలతో మాచర్ల మారుమోగింది. చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా వివిధ ప్రాంతాల నుంచి గొడుగులు చేత బూని మధ్యాహ్నం మూడున్నర గంటలకే మాచర్లకి తరలివచ్చారు. మాచర్లలోని శ్రీశైలంరోడ్డులో శుక్రవారం ప్రజాగళం సభకు నేతలు ఊహించని స్థాయిలో జనం తరలి వచ్చారు. అయితే వర్షం కారణంగా సభకు హెలికాప్టర్‌లో చంద్రబాబు రాలేకపోయారు. దీంతో అభిమానులు కొంత నిరుత్సాహనికి లోనయ్యారు. ఇది గ్రహించిన చంద్రబాబు ఒంగోలు నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించి వారిలో జోష్ నింపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ప్రత్యక్షంగా హాజరై ప్రసంగించిన దాని కన్నా గంబీరమైన ఉపన్యాసాన్ని వీడియోగ్రఫీ ద్వారా వినిపించారు. పౌరుషాల గడ్డ పల్నాడు ప్రజలందరికీ వందనం అంటూ ప్రసంగం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలను ఎండగట్టారు. పిన్నెల్లిని విమర్శించిన సందర్భంలో సభికులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ అరాచకంపై ఆవేదన, కసి ఉంది.. జగన్‌రెడ్డిని ఓడించాలనే ఆవేశం మీలో ఉంది.. ఆ ఆవేశం తిరుగుబాటుగా కనిపిస్తోందని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కుప్పంతో సమానంగా మాచర్లను చూసుకుంటానని హామీ ఇచ్చారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడుకు నీరిస్తానని తెలిపారు. ఆ తర్వాత మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా.. బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలగడానికి ఎంతో సమయం లేదని తెలిపారు. నా ప్రాణం పోయే వరకు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటా. మాట ఇచ్చానంటే ఆరునూరైనా సమస్య పరిష్కరించడానికే కృషి చేస్తానన్నారు.



ప్రసంగిస్తున్న బ్రహ్మారెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మధుబాబు తదితరులు

మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు : చంద్రబాబు

విధ్వంసకారుడు, దోపిడీదారుడు, సైకో ఏకమైతే జగన్‌రెడ్డి. పల్నాడులో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. పంటలతో పల్నాడు పచ్చగా ఉండాలని నేను తపిస్తే.. జగన్‌రెడ్డి రక్తంతో తడిపేశాడు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలో చేసిన అరాచకాలు అన్నీఇన్ని కావు. పోలీసుల్ని అడ్డం పెట్టుకుని హత్యా రాజకీయాలకు, హింసకు తెరలేపాడు. టీడీపీ కార్యాలయాలు తగలబెట్టాడు. ఇళ్లపై దాడులు చేశాడు. రౌడీ రాజకీయాల్ని తుదముట్టిస్తా. మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు. మాచర్లలో తిరుగుబాటు మొదలైంది. విప్లవంగా మారుతోంది. ప్రతి ఘటనకూ రిటర్న్ గిఫ్ట్ ఇస్తా. పల్నాడులో పసుపు జెండా నిలబెట్టడం కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను మరచిపోను. ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య, జల్లయ్య లాంటి కార్యకర్తలకు ఈ వేదికగా నివాళులర్పిస్తున్నా. పీకపై కత్తి పెట్టి జై జగన్ అంటే వదిలేస్తామన్నా ప్రాణాలొదిలిన చంద్రయ్య లాంటి వ్యక్తిని మరచిపోను. ఒక కార్యకర్త పార్టీని ఎంతగా ప్రేమిస్తాడో చంద్రయ్య ఓ ఉదాహరణ. పల్నాడులో 30 మంది కార్యకర్తల్ని వైసీపీ రౌడీలు పొట్టన పెట్టుకున్నా ఏ కార్యకర్తా వెనక్కి తగ్గలేదు.

మిమ్మల్ని నమ్ముకున్నా : బ్రహ్మారెడ్డి

మిమ్మల్ని నమ్ముకొని బరిలోకి వచ్చా.. రెండున్నరేళ్లుగా అధికారపార్టీకి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేశా.. పేదలు కడగండ్లను తీరుస్తానని కంటతడితో చెప్పారు. మాచర్లలో పరిస్థితి ఛంబల్‌లోయలో కన్నా దారుణంగా ఉంది. పెద్దదొర, చిన్న దొరలకు ముగింపు పలకకపోతే మన జీవితాలు వృథా అవుతాయి. పిన్నెల్లి సోదరులు వేలకు వేలు డబ్బులు చెల్లించి ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. జనం నోళ్లుగొట్టి వక్రమార్గంలో సంపాదించిన డబ్బులు ఎంతైనా ఖర్చు పెడతారు. ఓటే ఆయుధంగా భావించి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి. తప్పుడు కేసులు పెట్టారు. కార్లు కాల్చేశారు. బాధితులపైనే కేసులు పెట్టి కుటుంబాలకు దూరం చేసిన గుడుంబా సోదరులకు సోమవారం జరిగే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పి ఇంటికి పంపించాలి.

సూపర్ 6తో సక్సెస్ : శ్రీకృష్ణదేవరాయలు

సూపర్ 6 పథకాలతో మా విజయం పూర్తిస్థాయిలో సక్సెస్ అవుతుంది. మాచర్ల నియోజకవర్గంలో తాగు, సాగునీరు లేదు. మేము గెలిచిన ఏడాదిలోపు వరికపూడిశెల పూర్తి చేసి నీరందిస్తాం. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తాం. సాగర్ కుడి కాల్వను స్థిరీకరించి గోదావరి జలాల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తాం. బ్రహ్మారెడ్డి మాచర్లకి ఒంటరిగా వచ్చారు.. మీ బలంతో గెలిపించాలి

ఓట్ల పండక్కి.. వస్తున్నారు



- రైళ్లు, బస్సు సర్వీసులన్నీ ఇప్పటికే ఫుల్
- ఓటు వేయాలనే పట్టుదలతో ప్రయాణం
- దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు రాక
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి అధిక సంఖ్యలో
- ఓటర్ల కోసం కొందరు అభ్యర్థులు ప్రత్యేకంగా రవాణా ఏర్పాట్లు
- చార్జీలను పెంచిన ట్రావెల్స్.. హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కాదు.. దసరా సెలవులు లేవు.. అయినా దూర ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు తరలివస్తోన్నారు. ఓటు వేయాలనే పట్టుదలతో పండుగలకు వస్తోన్నట్లు తరలివస్తోన్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఓట్ల పండుగకు సొంతూళ్లకు తరలివస్తోన్నారు. సొంతూరుకి వచ్చి ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు ఉత్సాహం చూపుతున్నారు. స్వచ్ఛందంగా కొందరు ఓటర్లు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముందస్తు ఏర్పాట్లు చేసుకోని వారు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు. ఈ నెల 11 (రెండో శనివారం), 12 (ఆదివారం), 13 (పోలింగ్ రోజు) వరుస సెలవు దినాలు కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వస్థలాలకు ప్రయాణమయ్యారు. శుక్రవారం వివిధ కారణాలతో రాలేకపోయిన వారు శని, ఆదివారాల్లో స్వస్థలాలకు వచ్చేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉద్యోగులే కాకుండా చికిత్స రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న వారు కూడా ఓటు వేయాలని పట్టుదలతో వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ప్రతి ఓటును గెలుపుకు కీలకంగా భావిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లుగా నమోదై ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని స్వస్థలాలకు రప్పించడానికి వారం రోజుల నుంచి కసరత్తు చేస్తున్నారు. ఫోన్ చేయడం, వారి రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై వివరాలు అడిగి వారు రావడానికి కావాల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చారు. దీంతో ఓటు వేసేందుకు పలువురు ఆసక్తితో స్వస్థలాలకు బయల్దేరారు. సైబరాబాద్‌లో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారిలో వేల మంది ఆ రుణాన్ని తీర్చుకోవాలని భావించి తరలివస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో జిల్లాకు చెందిన వేల మంది ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే చాలామంది రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ నిత్యం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నా వాటిలో టిక్కెట్లు రిజర్వు అయిపోయాయి. ప్రైవేటు ఆపరేటర్లు టిక్కెట్ చార్జీలను పెంచేశారు. ట్రావెల్స్‌లో హైదరాబాద్ నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేలు, బెంగళూరు నుంచి అయితే టిక్కెట్ ధర రూ 4 వేలు పలుకుతోంది. ఈ రేట్లకు టిక్కెట్ కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి లేదు. హైదరాబాద్ నుంచి ఏసీ స్లీపర్‌లో రూ.2,601 చార్జీగా నిర్ణయించారు. బెంగళూరు ఇతర ప్రాం తాల నుంచి కూడా బస్సుల్లో టిక్కెట్లు బుక్ అయిపోయాయి. ఈ క్రమంలో సొంత ఖర్చులతో వచ్చిన వారికి ఆ మొత్తం తిరిగి చెల్లిస్తామనే హామీని ఇస్తూ ఓటర్లను అభ్యర్థులు స్వగ్రామాల బాట పట్టిస్తున్నారు. టిక్కెట్లు లభించక ఇబ్బందులు పడుతున్న వారి కోసం హైదరాబాద్ నుంచి ఆయా పార్టీల అభ్యర్థులకు చెందిన అనుచరులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కు కనీసం 50 వేల మందికిపైగా ఇతర ప్రాంతాల్లో నివ సిస్తున్న ఓటర్లు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో దాదాపు 35 నుంచి 40 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో ఎక్కువ మంది స్వస్థలాలకు రానున్నట్లు సమాచారం. దీంతో జిల్లా పరిధిలో ఆర్టీసీ శుక్రవారం రాత్రి నుంచి దాదాపు 50 ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నది.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

● సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్ కుమార్ వెల్లడి

గుంటూరు(తూర్పు), మే 10: ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈనెల 13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఉమ్మడి గుంటూరు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని పరిశ్రమలు, సినిమా హాల్స్, ఇతర దుకాణదారుల యాజమానులకు సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సదరు సెలవు రోజున కార్మికుల వేతనాలలో ఎటువంటి తగ్గింపు చేయవద్దని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే సదరు యాజమానికి జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమస్యలు, ఫిర్యాదుల కోసం 94925 55145 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వస్త్రవ్యాపారి ఇంటిపై ఐటీ దాడులు

● గురువారం తెల్లవారుజాము నుంచే మొదలైన సోదాలు

మంగళగిరి, మే 10: స్థానిక మంగళగిరి మెయిన్‌బజారులో ఉన్న ప్రముఖ వస్త్ర వ్యాపారి ఇంటిపై ఐటీ అధికారులు దాడులు చేశారు. మెయిన్‌బజారుకు అనుబంధంగా వున్న భాగవతులవారి వీధిలో ఉంటున్న సదరు వ్యాపారి ఇంట్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఈ దాడులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. నగరంలో భారీ వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తుండడంతో పాటు వడ్డీలు, చిట్స్ వంటి ఇతర వ్యాపారాలను కూడ ఈ వ్యాపారి నిర్వహిస్తూ వుంటారు. ఐటీ అధికారులు కచ్చితమైన సమాచారం మేరకే ఈ దాడులు చేసినట్టు తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామునుంచి మొదలైన ఈ సోదాలు శుక్రవారం సాయంత్రం వరకు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. వ్యాపారి నివాసం అండర్‌గ్రౌండ్‌లో అయిదు అడుగుల ప్రత్యేక లాకర్‌ను చాలా పకడ్బందీగా ఏర్పాటు చేసుకున్నట్టు ఐటీ అధికారులు తమ సోదాలలో గుర్తించారంటున్నారు. ఈ లాకర్‌లో వందల కిలోల కొద్దీ కొన్ని వెండి వస్తువులు, మరికొన్ని బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్లు, పెద్దఎత్తున చెక్కులు, ప్రామిసరీ నోట్లు, మరికొన్ని డాక్యుమెంట్లు ఉన్నట్టు చెబుతున్నారు. రూ.కొన్ని కోట్ల నగదును కూడ ఐటీ అధికారులు కనుగొన్నట్టు ప్రచారం జరుగుతోంది. పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావల్సి ఉంది.



యడ్లపాడు సొసైటీ స్థలంలో భోజనాల కోసం వైసీపీ నాయకులు వేసిన టెంట్లు

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన

● సొసైటీ స్థలంలో టెంట్లువేసి భోజనాలు

యడ్లపాడు, మే 10: ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పార్టీ తరపున ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదని నిబంధనలు ఉన్నా ఖాతరు చేయడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు యడ్లపాడులో రోడ్‌షో నిర్వహించాడు. రోడ్‌షోలో పాల్గొన్న వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు విందు ఏర్పాటు చేశారు. యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో టెంట్లువేసి భోజనాలను వడ్డించారు. ఒక పక్క ఎంపీడీవో కార్యాలయం, మరోవైపే పంచాయతీ కార్యాలయం, ఎదురుగా తహసీల్దార్ కార్యాలయం ఉన్నా ఏ అధికారి కూడా సదరు కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయక పోవడం విశేషం.

అపూర్వ ఆదరణ

● మీరు చూపిన కృతజ్ఞతను అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తా
● పెమ్మసాని చంద్రశేఖర్
● ప్రత్తిపాడు మండలంలో రోడ్‌షో
● అన్ని గ్రామాల్లో బూర్ల, పెమ్మసానిలకు బ్రహ్మరథం



రోడ్ షోలో మాట్లాడుతున్న పెమ్మసాని పక్కన బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, మే 10: మీరు మాపై చూపుతున్న కృతజ్ఞతను అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తానని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని యనమదల, ఈదులపాలెం, నడింపాలెం, రావిపాటివారిపాలెం, ప్రత్తిపాడు, గొట్టిపాడు గ్రామాలలో ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తల నడుమ జరిగిన ఈ రోడ్‌షోకు గ్రామస్థులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. పెమ్మసాని, బూర్ల వస్తున్నారని తెలిసిన తెలుగుదేశం పార్టీ అభిమానులు గంటల తరబడి రోడ్డుపై నిలబడి వారి కోసం వేచి చూశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలుపును ఆపడం ఎవరి తరం కాదన్నారు. అవినీతి సొమ్ముతో ఆంధ్రులను కొనలేరని ఆయన తెలిపారు. ఎస్సీల మీదే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టే పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. దళిత డాక్టర్‌ను మాస్క్ అడిగిన పాపానికి ఏ విధంగా చేశారో.. దళిత డ్రైవర్‌ను చంపి ఎలా డోర్ డెలివరి చేశారో అందరూ చూశారా లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగులను బిచ్చగాళ్లగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఉద్యోగులు తన వద్దకు వచ్చి ఒకటో తేదీన జీతం పడే విధంగా చూడాలని కోరారన్నారు. పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులుగా, అధికారులను బానిసలుగా మార్చి, వారి చేత తప్పులు చేయించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు దోచి నేడు గ్రామాలలో పంచుతున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంత డబ్బు పంచుతున్నారంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి యాజమాన్యానికి లీగల్ నోటీసులు

● నాపై చేసిన ఆరోపణలకు 10 రోజుల్లో మీ ఛానెల్‌లోనే క్షమాపణ చెప్పాలి..
● లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు
● డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరిక

గుంటూరు, మే10(ఆంధ్రజ్యోతి): తనపై చేసిన అసత్య ఆరోపణలపై గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సీరియస్‌గా స్పందించారు. సాక్షి యాజమాన్యానికి శుక్రవారం ఆయన తరపున ప్రముఖ న్యాయవాది డీ. కోటేశ్వరరావు ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. సాక్షి తెలుగు టీవీ ఛానెల్ (ఇందిరా టెలివిజన్ లిమిటెడ్) చైర్మన్ వైఎస్ భారతిరెడ్డి, డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాదరెడ్డి, హోల్ టైమ్ డెరెక్టర్ బండి రాణిరెడ్డికి ఆయన లీగల్ నోటీసులు జారీ చేశారు. సాక్షి ఛానల్‌లో ఈనెల 5వ తేదీన తనపై ఆయనొక ఎన్నారై.. అడ్డదిడ్డంగా డబ్బు సంపాదించారు.. చంద్రబాబును ఆశ్రయించి 200 కోట్లు ముట్టజెప్పి గుంటూరు పార్లమెంటు సీటు కొట్టేశారు. చిన్నబాబుకు 100 కోట్లు ప్యాకేజీ ఇచ్చారు' అంటూ తప్పుడు కథనాల ప్రసారం చేయడంతో పాటు యూట్యూబ్‌లో అదేపనిగా ప్రసారం చేశారని ' 'ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది, తన మిత్రులు, బంధువులు, సహచరులు, రాజకీయ ప్రముఖులు ఆ ప్రసారాలను చూశారని, అసత్య ఆరోపణల వల్ల తన పేరు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పెమ్మసాని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ సాక్షిఛానెల్, యూట్యూబ్‌లలో అయితే తనపై తప్పుడు ఆరోపణలు చేశారో అవే ఛానెళ్లలో పది రోజుల్లో తనకు క్షమాపణ చెబుతూ ప్రసారాలు చేయాలని, రూ. 100 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని ఆ లీగల్ నోటీసులో డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాను తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు.

ఏ ముఖం పెట్టుకుని మళ్లీ వస్తారు?

● జగన్‌ను ప్రశ్నించిన ప్రత్తిపాటి



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 10: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చిలకలూరిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని ఇక్కడకు ఎన్నికల ప్రచారానికి వస్తారని మాజీమంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రచారం నిమిత్తం చిలకలూరిపేటకు రానున్న నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఇక్కడికి వచ్చినప్పుడు జరిగిన సభలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యడవల్లిలోని దళితులకు సాగు భూమి పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలానే 98శాతం పూర్తయిన 4,512 టిడ్కో ఇళ్ల ఐదేళ్లగా ఎందుకు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వలేదని అన్నారు. జగనన్న కాలనీల పేరిట జరిగిన భారీ అవినీతిలో జగన్, స్థానికమంత్రి పాత్ర ఏమిటో కూడా ప్రజలకు చెప్పాలన్నారు. రజిని అడిగిందని రూ.65 కోట్లు నిధులు ఇస్తున్నట్లు ఊదరగొట్టిన జగన్, తర్వాత ఒక్కరూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు, చిలకలూరిపేట దాహార్తి తీర్చే అమృత్ పథకం ఎందుకు పూర్తిచేయలేదనీ నిలదీశారు. 35 వేలమంది ముస్లింలు నివసించే చిలకలూరిపేటలో ఆటోనగర్ పూర్తిచేసి ఉంటే మహీంద్రా, టాటాలు వంటి పెద్ద కంపెనీలు వచ్చే అవకాశం ఉన్నా దానిని ఎందుకు పట్టించుకోలేదన్నారు. అనంతరం మాట్లాడిన మల్లెల రాజేష్ నాయుడు చిలకలూరిపేట ప్రజలు పార్టీలకు అతీతంగా ఆలోచించి మోసంచేసిన వాళ్లను పక్కనపెట్టి మంచి చేసేవాళ్లకే అవకాశం ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీల విడదలరజిని చేసిన మొట్టమొదటి మోసం డబ్బులు వసూలు చేయడమేనన్నారు. చిలకలూరిపేట రైతులను, దళితులను మోసంచేసి వ్యాపారుల నుంచి దండుకుంటున్న విడదల రజినీని ఇక్కడ తరిమితరిమి కొడతారనే భయంతో జగన్‌రెడ్డిని బతిమిలా డుకొని గుంటూరు పారిపోయిందన్నారు. ఇప్పుడు చిలకలూరి పేట సరిహద్దులు కూడా తెలియని వ్యక్తి మనోహర్‌ను ఇక్కడకు తెచ్చార న్నారు. అతడు గుంటూరులో చేసిన దందాలు సరిపోక ఇక్కడికి వచ్చి కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని మోసం చేస్తున్నారన్నారు. ఇవన్నీ గమనించే ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర నేత్ర చికిత్సాలయ వైద్యులు

ఓటు వేయండి.. ఉచిత కంటి వైద్యాన్ని పొందండి

● ఓటు హక్కుపై అవగాహన కోసం వినూత్న ప్రయత్నం

తెనాలి, మే 10(ఆంధ్రజ్యోతి): ఓటు వేయండి.. వేసి వచ్చాక మీచేతి వేలిపై ఉన్న సిరా చుక్కను చూపిస్తే చాలు... ఉచితంగా కంటి పరీక్షలు చేస్తాం. శుక్లాల ఆపరేషన్‌ల వంటివికూడా తక్కువ ధరలో చేస్తామంటూ తెనాలిలోని శంకర నేత్ర చికిత్సాలయం ఓ ఆఫర్‌ను గోడప్రతుల ద్వారా విడుదల చేసింది. ఓటు హక్కు విలువ తెలియచేయటం, వారి హక్కును సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ అవకాశాన్ని ఇస్తున్నామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ నదెళ్ల స్వాతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 13న పోలింగ్‌లో పాల్గొని ఈ నెల 31వ తేదీలోపు ఎపుపడు వచ్చి వేలిపై ఉన్న సిరా గుర్తును చూపితే అపుపడు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తామన్నారు.

పోలీసు అధికారుల నియామకం

నరసరావుపేట, మే10: మాచర్ల నియోజకవర్గంలో వైసీపీకి కొమ్ముకాస్తున్న ముగ్గురు పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్ బదిలీ చేయగా ఆయా స్థానాల్లో కొత్తగా పోలీసు అధికారులను నియమిస్తూ శుక్రవారం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కారంపూడి సీఐగా టీపీ నారాయణస్వామి, మాచర్లపట్టణ సీఐగా బీ.బ్రహ్మయ్య, వెల్దుర్తి ఎస్ఐగా ఎం.వెంకట్రావులను నియమించింది. వైసీపీ అనుకూలంగా ఉంటున్నారన్న ఆరోపణలతో మాచర్ల పట్టణ సీఐ పీ.శరత్‌బాబు, కారంపూడి సీఐ బీ.చిన్నమల్లయ్య, వెల్దుర్తి ఎస్ఐ వంగా శ్రీహరిలను బదిలీచేసిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మంగళగిరి సిటీ, మే 10: బైకుపై వెళుతున్న ఓ విద్యార్థిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తెనపల్లికి చెందిన గాడిదపాటి నవీన్ (16) ఇటీవలే పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాడు. నవీన్ తండ్రి తాడేపల్లిలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటాడు. తండ్రి వద్దకు వచ్చిన నవీన్ శుక్రవారం ఉదయం ఎవ్వరికీ చెప్పకుండా ద్విచక్ర వాహనంపై బయటికి వచ్చాడు. మంగళగిరి మండలం ఆత్మకూరు హ్యాపీ రిసార్ట్స్ వద్దకు వచ్చేసరికి సర్వీసు రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు నవీన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలకు విద్యుత్ శాఖ

ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు

గుంటూరు, మే 10: ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గుంటూరు జిల్లావ్యాప్తంగా సర్కిల్ కేంద్రంతో పాటు డివిజనల్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించా మన్నారు. 24 గంటలు నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. గుంటూరు సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ సెల్ 9440817526, గుంటూరు టౌన్-1 డివిజన్ 9440817527, తెనాలి డివిజన్ 9440817535, బాపట్ల డివిజన్ 9491052945, నరసరావుపేట డివిజన్ 9440817539, మాచర్ల డివిజన్ 9440817531లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు వాటిల్లినా వెంటనే ఆయా కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

రాజుపాలెం, మే10: గుంటూరు-మాచర్ల రహదారిపై మండల పరిధిలోని రాజుపాలెం గ్రామ సమాపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఏలూరు మండలం ప్రతికూలంక గ్రామానికి చెందిన బలే విజయకుమార్(34) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిసున్నాడు. ఈక్రమంలో విజయకుమార్ మాచర్ల పట్టణంలో సిమెంటు లారీలో లోడు చేసుకోని ఏలూరుకు బయల్దేరాడు. మార్గం మధ్యలోని రాజుపాలెం గ్రామ సమిపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్దకు చేరుకొంది. లారీ వెనుక టైర్ గాలి తగ్గినట్టు ఉంటే లారీని ఆపి టైర్‌ను చెక్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో విజయకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై షామీర్‌బాషా సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

క్వారీల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

● రూ.1.49లక్షల అపరాధరుసుం విధింపు

యడ్లపాడు, మే 10: మెటల్ క్వారీల్లో మైనింగ్ విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 8న నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో బిల్లులు లేకుండా మెటల్ తరలిస్తున్న రెండు టిప్పర్‌లతోపాటు లోడింగ్‌కు ఉపయోగిస్తున్న రెండు ఎస్కవేటర్‌లను అధికారులు సీజ్‌చేశారు. వెంకటరమణ స్టోన్ క్రషర్‌కు చెందిన ఒక ఎస్కవేటర్ రెండు టిప్పర్‌లు, బాబా స్టోన్ క్రషర్‌కు చెందిన ఎస్కవేటర్‌ను సీజ్ చేసిన అధికారులు స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం వెంకటరమణ స్టోన్ క్రషర్‌కు చెందిన వాహనాలకు మైనింగ్ అధికారులు రూ.1.49లక్షలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. కాగా బాబా క్రషర్‌కు చెందిన ఎస్కవేటర్‌కు సంబంధించి అపరాధరుసుం విధించలేదని విజిలెన్స్ ఏడీ శివాజి తెలిపారు.

రాక్షస పాలనని అంతమొందిద్దాం..

● బ్రాహ్మణ సమాజం పిలుపు

గుంటూరు, మే 10: రాష్ట్రంలో రాక్షసపాలనని 'ఓటు' తో అంతమొందిద్దాం... జగనాసుర సంహారానికి ముహూర్తం ఖరారు చేసిన త్రిమూర్తులు... అన్ని వర్గాలు కలసికట్టుగా కూటమి అభ్యర్థుల్ని గెలిపించుకుందాం... అని బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం సంయుక్తంగా గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ, అర్చక సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి మాట్లాడుతూ త్రేతా యుగం, ద్వాపర యుగంలో రాజ్య పరిపాలనలను సక్రమంగా నిర్వహించకుండా రాజులు, మునులు, ప్రజలు, దేవతలపై అప్పట్లో రాక్షసులు దాడులకు దిగుతూ హింసలకు గురిచేస్తూ హత్యలు దోపిడీలు చేస్తూ అరాచకం సృష్టించే వారని, అలాంటి సందర్భంలో బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు వివిధ రూపాల్లో అవతారాలు ఎత్తి రాక్షసులను సంహరించే వారన్నారు. అలానే ఈ కలియుగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనే రాక్షస మనస్తత్వం కలిగి మాయ మాటలు చెప్పి ఒక్క ఛాన్స్ అని ప్రజల్ని మోసం చేసి గత ఐదేళ్లుగా క్రూర రాక్షస పరిపాలన కొనసాగించాడన్నారు. అతని పాలనలో ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, అన్ని కుల, మత వర్గాల వారు అనేక హింసలకు, దాడులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రాక్షసుడు అని తెలియక నమ్మి మోసపోయామని ప్రజలు, ప్రతిపక్షాలు వాపోతున్న సమయంలో ఆ త్రిమూర్తులు ఎన్నికల రూపంలో ప్రజల చేతిలో ఈ రాక్షసుడిని అంతమొందించేందుకు ఈనెల 13 తేదీన ముహూర్తం ఖరారు చేశారన్నారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ముస్లిం, క్రిస్టియన్, మార్వాడి కుటుంబాలు, వివిధ కులవర్గాలవారు ఈ ప్రభుత్వ విధానాలపై తిరగబడి త్రిమూర్తులు ఇచ్చిన అవకాశాన్ని ఓటు అనే ఆయుధంతో ఈ జగనాసురుడ్ని సంహరించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కొప్పర్తి సీతారమేష్, బొడ్డుపల్లి శ్రీనివాసు, నల్గొండ రాధాకృష్ణమూర్తి, బందా శశిధర్, వేదాంతం శ్రీనివాస్, ప్రతాప ప్రసాద్, లంకా రవి, ఐలూరి శ్రీనివాస్, వడ్డమాను ప్రసాద్, చిలుమూరు ఫణి, ఐలూరి నాని పాల్గొన్నారు.

ముస్లిం లీగ్ పార్టీ వైసీపీకి మద్దతు ప్రకటించలేదు

● సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటనని తీవ్రంగా ఖండిస్తున్నాం
● ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బషీర్ అహ్మద్

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ముస్లిం లీగ్ పార్టీ వైసీపీకి మద్దతు ప్రకటించిందని సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటనను ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది బషీర్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. వాస్తవంగా ఓటమి భయం పట్టుకున్న వైసీపీ ముస్లిం లీగ్ ఓట్లను దొంగలించడం కోసం లెటర్ హెడ్‌పై ఇండియన్ ముస్లిం లీగ్ అనే పేరుతో నకిలీ సంస్థను ఏర్పాటు చేసి ఈ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై గుంటూరులోని పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. స్వయం ప్రకటిత ఇండియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించుకున్న హుస్సేన్ బాషా, అతని సహచరులు తోటి కుట్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసీపీ కేంద్ర కార్యాలయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సజ్జల కావాలనే ఈ నకిలీ సంస్థతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించాడని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీని ఎదుర్కొనలేక దొంగ దెబ్బలు తీయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో ముస్లింలు ఎవరు వైసీపీ వైపు లేరని కేవలం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ వైపే ఉన్నారని స్పష్టమైనది అన్నారు. ఇటువంటి కుట్ర చిల్లర పనులను మానివేయాలని సజ్జలను హెచ్చరించారు. తమ పార్టీ ఎవరికి కూడా మద్దతు ప్రకటించలేదని తాము అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తున్నామని ప్రజలు గమనించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



బెల్లంకొండ సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

ముస్లింలకు తీరని అన్యాయం చేసిన జగన్

● రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షులు రఫీ

బెల్లంకొండ, క్రోసూరు, మే10: రాష్ట్రంలో ముస్లింలకు సీఎం జగన్‌రెడ్డి తీరని అన్యాయం చేశారని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఆరోపించారు.. శుక్రవారం ఉదయం బెల్లంకొండ, క్రోసూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముస్లిం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రఫీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కార్పోరేషన్‌లను ఏర్పాటు చేసి చైర్మన్‌లను కుర్చీలకే పరిమితం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వలాభం కోసం ముస్లింలను వాడుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలను తొలగించారని, ముస్లిం బరియల్ గ్రౌండ్‌లకు ప్రహరీ నిర్మిస్తామని హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ముస్లిం రిజర్వేషన్‌లో చంద్రబాబు నాయుడు స్పష్టమైన వైఖరిని ప్రకటించారన్నారు. రిజర్వేషన్‌ల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం వస్తే ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో మైనార్టీ సెల్ నాయకులు సలాం, బెల్లంకొండ మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, బెల్లంకొండ వైస్ సర్పంచ్ సుభానీ, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఇబ్రహీం, ముస్తఫా, చిట్టి, సయ్యద్ జబ్బార్, సయ్యద్ మజీద్, సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. క్రోసూరులో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మస్తాన్, క్రోసూరు మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, పెదకూరపాడు మండల వైస్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దళిత బిడ్డల పాలిట శకుని మామ జగన్

● మాల మహానాడు వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు



మల్లెల వెంకట్రావు

పొన్నూరుటౌన్, మే10: రాజ్యాంగ సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత బిడ్డల పట్ల శకుని మామగా జగన్ రెడ్డి మారాడని మాల మహా సభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ జగన్ నవరత్నాలు, ఎస్సీ ఎస్టీలకు సమాధి రాళ్లుగా మారాయని దుయ్యబట్టారు. వైసీపీ మేనిఫెస్టో టిష్యూ పేపర్‌గా పేర్కొన్నారు. దళితుల సానుభూతి ఓట్లతో గద్దెను ఎక్కిన జగన్ రెడ్డి అధికారం వచ్చిన తర్వాత 9 వేల ప్రాథమిక పాఠశాలను రద్దు చేశారని ధ్వజమెత్తారు. ఉద్యోగాల్లో ప్రమోషన్ల జాబితాలో రిజర్వేషన్ల రద్దును వైసీపీ ప్రభుత్వంలో జరిగిందని ఆరోపించారు. దళితులకు ఇన్ని పథకాలు రద్దు చేసిన జగన్‌ను కొందరు ఉద్యమకారులు నిస్సిగ్గుగా సమర్థించటం అనైతిక చర్య అని అన్నారు. పాలక వర్గాల పాదాల వద్ద దళితుల రాజ్యాంగ హక్కులను పణంగా పెట్టడమేనని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 82 మంది మాలలను చంపిన వైసీపీ మూకలకు దళిత ఉద్యమ మేధావులు ఏవిధంగా మద్దతు ఇస్తారని మల్లెల ప్రశ్నించారు. రాయితీలు, సంక్షేమ ఫలాలు రద్దు చేసిన జగన్ మంచి పాలకుడో, జగన్ భజనలు చేస్తున్న దళిత మేధావులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మేధావులు పేరుతో దళిత ద్రోహులకు భజన చేస్తున్న అద్దె మైకులతో ఎస్సీ, ఎస్టీలు జాగరూపుతో ఉండాలని హెచ్చరించారు. జగన్ రద్దు చేసిన పథకాలు తిరిగి ప్రారంభం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.

మూడు ముక్కలాటతో రాష్ట్రం నాశనం

● 1606వ రోజుకు ఆందోళనలు..



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

తుళ్లూరు, మే 10: విజనరికి ఓటు వేయాలని, విధ్వంసకుడిని ఇంటికి పంపాలని రాష్ట్ర ప్రజలకు, రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు 1606వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. అమరావతిని అభివృద్ధి చేయమని హైకోర్టు చెప్పిన పెడచెవిన పెడుతున్న జగన్‌రెడ్డి ప్రజల గోడు ఎలా వింటాడన్నారు. నియంత పాలన మనకొద్దని, విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకుందామని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

60,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 51,030 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 60,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,866 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17500
నెంబరు. 5	10000	16000
273	10500	13000
341	9000	17000
4884	10000	13000
సూపర్ 10	9000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	10000	14000
దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	5000	11000

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి : డేగల ప్రభాకర్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ఇచ్చిన హామీలు ప్రజల బతుకులు మార్చేస్తాయని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది సుఖ సంతోషాలతో ఉంటాయని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర కార్యదర్శి నిశంకరరావు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో 16వ డివిజన్లో ఏర్పాటు చేసిన ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వం అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందజేస్తామన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నవరత్నాలపై జగన్‌రెడ్డి చెప్పినవన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు. ప్రజలంతా వైసీపీని గద్దెదించాలని నిర్ణయించుకున్నారని, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ వాసు, నల్లక స్వామి, డేగల ఉదయ్, శివాలశెట్టి శ్రీను, గూడపాటి రమేష్, నవీన్, కుర్రా శ్రీహరి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగోతు

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన నాగోతు శౌరయ్యను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన మిరియాల రత్నకుమారిని తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలిగా, షేక్ మౌలాలీని మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశ భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం

● సీపీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, రాజా

గుంటూరు(తూర్పు), మే 10 : క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశాన్ని కాపాడుకోవాలంటే ఈ ఎన్నికలు చాల కీలకమైనవని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కాంక్షిస్తూ గుంటూరు విజయాటాకిస్ ప్రాంగణంలో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. సభకు డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి, డి.రాజాలు మాట్లాడుతూ మోదీ విధానాల కారణంగా ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి పాలన కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి, రైతు సంఘ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ అంగీకారం తెలిపి, చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, ఇండియా కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు జంగాల అజయ్‌కుమార్, షేక్ మస్తాన్‌వలీ, డాక్టర్ జాన్‌బాబు, కొరివి వినయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ నాయకులు అక్కినేని వనజ, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి బహిరంగ సభ వరకు ఇండియా కూటమి జిల్లా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి, వేదికపై డి.రాజా, వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి



ల్యాండ్ టైటిలింగ్ జీవో ప్రతులను దహనం చేస్తున్న గల్లా మాధవి

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల మధ్య ల్యాండ్ టైట్లింగ్ యాక్టు జీవో ప్రతులను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు 24, 31, 25 డివిజన్లలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు పేరుతో చివరకు ప్రజల ఆస్తులను సైతం కబ్జా చేయాలని వైసీపీ నేతల పన్నాగం పన్నారంటూ విరుచుకుపడ్డారు. జగన్మోహన్‌రెడ్డికి ఇవే చివరి ఎన్నికలని, ప్రజలు ఓట్ల రూపంలో వైసీపీకి బుద్ధి చెప్పటానికి సిద్ధమైపోయారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో తాను ఎక్కడికి వెళ్లినా జనజాతర కనిపిస్తోందన్నారు. చంద్రన్న నమ్మకం, పవనన్న పిలుపు, బీజేపీ అండతో పశ్చిమ నియోజకవర్గం గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమాల్లో మల్లెల ఈశ్వర రావు, కొల్లి అనిల్, పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాబును మళ్లీ రప్పిద్దాం!

రాష్ట్ర భవిష్యత్తు బాగు కోసం, యువత, విద్యార్థులతోపాటు ప్రజల జీవితాలు బాగుపడాలంటే బాబును మళ్లీ రప్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని పారిశ్రామికవేత్త గల్లా రామచంద్రరావు, పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో 'బాబును మళ్లీ రప్పిద్దాం!' సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పెరవలి వంశీ, వెంకట్రావు, విక్రమ్, రషీద్, మన్నెం శ్రీనివాస్, గంజి శ్రీనివాస్, రాంబాబు, ఆదిత్య, సాంబశివరావు, శేషాద్రి పాల్గొన్నారు.



బాబును మళ్లీ రప్పిద్దాం సదస్సులో గల్లా రామచంద్రరావు, సాయికృష్ణ తదితరులు

వైసీపీ ప్రభుత్వానికి ఓట్లతో బుద్ధి చెప్పండి

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నసీర్

గుంటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి ఓట్లతో బుద్ధి చెప్పాలంటూ గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరు 1వ డివిజన్ జియావుద్దిన్ నగర్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ నాయకులు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందని, నేడు వైసీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో కరెంటు, బస్సు చార్జీలు, పన్నుల భారం, నిత్యావసర సరుకుల అధిక ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలని కోరారు. మహాశక్తి పథకం మహిళలు సమాజంలో ఉన్నంతగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ అన్వర్, బేళ్ల వెంకటేశ్వర్లు, జబి, దిలీప్, గాని రెడ్డి, రుబాన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే బ్రాండ్

చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్ అని, ఆయనతోనే అభివృద్ధి సాధ్యమని నసీర్ అన్నారు. నగరంలోని ఐదో డివిజన్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ పాలన కొనసాగుతోందని, ఈ ఎన్నికల్లో ఆ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రెండుసార్లు గెలిచిన ముస్తఫా గుంటూరు తూర్పుకు చేసిందేమీ లేదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, దాసరి ప్రసాద్, ఆళ్ల నాని, మస్తాన్, రాజేశ్, ముని తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న నసీర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి, హాజరైన అధికారులు

ఎన్నికల సిబ్బంది పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం తగదు

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 10 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13 జరగనున్న పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ టీం సభ్యులతో పోలింగ్ విధులపై సమావేశం నిర్వహించారు. ఆర్వో కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరగడంలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర అని, సెక్టార్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, కేటాయించిన పీఓలు, ఇతర పోలింగ్ సిబ్బందితో నిరంతరం సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటికే సెక్టార్, రూట్ అధికారులకు వైర్‌లెస్ సెట్‌లు అందించామని, ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం సెట్ ద్వారా తెలియచేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తక్షణం సెట్ ద్వారా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మౌలిక వసతులని పరిశీలించాలని, ఏ సమస్య ఉన్నా వెంటనే సంబంధిత ఏఈకి తెలియచేయాలన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 187 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ జరుగుతుందని, అందుకు తగిన సీసీ కెమెరాల ఏర్పాట్లు సంబంధిత ఏఈలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుంచి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో రిపోర్టింగ్ టీంని ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్‌కి అవసరమైన మెటీరియల్‌ను ఆదివారం ఉదయం నుండే అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సెక్టార్ అధికారులు మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోనే పీవోలు, ఏపీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్ సమయంలో ఏ సమస్య ఎదురైనా పరిష్కారానికి క్విక్ రియాక్షన్ టీంని జీఎంసీ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏఆర్‌ఓలు భీమరాజు, ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు టి.వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మి, ఎంహెచ్‌ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామిరెడ్డి, సెక్టోరియల్ అధికారి బి.శ్రీధర్ బాబు, డీఈఈలు శ్రీధర్, రాము, మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

గుంటూరు, మే 9 : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కొత్తపేట సీఐ అన్వర్‌బాషా హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నచికేత్ శెళ్కే ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్‌లో పోలీసుల కవాతు నిర్వహించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది, తమిళనాడు పోలీస్ సిబ్బందితో కలసి సీఐ అన్వర్ భాష కవాత్ నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్తపేట, మాయాబజార్, ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, 60 అడుగుల కొత్త రోడ్డు, గుంటూరువారితోట, రామిరెడ్డితోట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాలలో కవాతు నిర్వహించారు.


ఇప్పటంలో లోకేశ్‌కు హారతులు పడుతున్న మహిళలు

సంగంపై.. కుట్రలు

- సంగం పాలధారలు.. నిర్వీర్యానికి కుయుక్తులు
- వెయ్యి కోట్లకు చేరుకున్న సంగం టర్నోవర్
- సంగం స్వాధీనానికి ప్రయత్నాలు


సంగం డెయిరీ కేసులో అరెస్టు అయిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ (ఫైల్)

పొన్నూరుటౌన్, మే10: దక్షిణ భారతదేశానికే వన్నె తెచ్చేలా ప్రగతి పథంలో పయనిస్తున్న సంగం డెయిరీ ప్రగతిలో ధూళిపాళ్ళ కుటుంబానికి చెరగని ముద్ర. సంగం డెయిరీ వ్యవస్థాపకులో ఒక్కరైన యడ్లపాటి వెంకట్రావు హయాం నుంచి ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి అయన అనంతరం కుమారుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సంగం డెయిరీ ఖ్యాతిని దక్షిణ భారతదేశానికి విస్తరించారు. చిన్న పాడి సమాఖ్యగా ప్రారంభమైన సంగం డెయిరీ నేడు వెయ్యి కోట్లకు పైగా వ్యాపారం చేసే దిశగా ధూళిపాళ్ళ కుటుంబం అహర్నిశలు పాటుపడింది. అనతి కాలంలోనే సంగం డెయిరీ ఆంధ్రప్రదేశ్‌తోపాటు, పలు రాష్ట్రాలకు సేవలను విస్తరించింది. సంగం డెయిరీ పేరు చెబితే ధూళిపాళ్ళ కుటుంబమే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేలా చెరగని ముద్రను వేసుకుంది. పాల రైతుల కుటుంబాల్లో క్షీర విప్లవానికి కారణమైన సంగం డెయిరీని నిర్వీర్యం చేయటంతోపాటు, ఆ సంస్థను హస్తగతం చేసుకునేందుకు గత ఐదేళ్లలో జరిగిన ప్రయత్నాలు జిల్లా వాసులను నేటికి వెంటాడుతునే వున్నాయి.

ధూళిపాళ్ళపై అక్రమ కేసులు..

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలోకి అమూల్ సంస్థను ప్రవేశపెట్టారు. సహకార రంగంలో ప్రగతి దిశగా దూసుకు వెళుతున్న సంగం లాంటి సంస్థలను నిలువరించకపోతే అమూల్ రైతుల ఆదరణ కోల్పోతుందని దుష్ట ఆలోచనతో సంగం చైర్మన్ నరేంద్ర కుమార్‌ను అనేక రకాలుగా వైసీపీ పెద్దలు వత్తిడి తెచ్చారు. రాజకీయంగా చురుకుగా ఉండే నరేంద్ర కుమార్ ప్రభుత్వ పెద్దలకు కంటిలో నలుసుగా మారారు. దశాబ్దాల క్రితం సంగం డెయిరీ విశేష సేవలు అందించిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మరణానంతరం అయన సేవలకు గుర్తుగా సంగం ఉద్యోగులు డీవీసీ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఆనాటి పాలక మండలి ట్రస్ట్‌కు ఖాళీగా ఉన్న పది ఎకరాల భూమిని కేటాయించింది. ఈ స్థలంలో నరేంద్ర కుమార్ చైర్మన్ అయిన తర్వాత డివిసి హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను స్థాపించి పాల రైతులకు, పేదలకు రాయితీపై వైద్యాన్ని అందిస్తున్నారు. అయితే ట్రస్టు పేరుతో బదలాయించిన భూమి అక్రమం అని, వైసీపీ ప్రభుత్వం నరేంద్రపై ఏసీబీతో కేసు నమోదు చేయించింది. అంతే కాకుండా ఆగమేఘాల మీద నరేంద్ర కుమార్‌ను తెల్లవారు జామున అరెస్టు చేసి 30 రోజుల పాటు జైలు పాలు చేసింది. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ప్రయత్నించినప్పటికి సంగం డెయిరీ పరిధిలోని ఒక్క పాల రైతు కూడా సంగంకు వ్యతిరేకంగా నోరు విప్పలేదు సరికదా, నరేంద్రకు బాసటగా నిలిచ్చారు. నరేంద్ర జైలు నుంచి విడుదల అయిన తర్వాత సంగం డెయిరీని మరింత విస్తరించి అభివృద్ధి చేయటమే కాకుండా తనకు అండగా నిల్చిన పాడి రైతుల సంక్షేమానికి మరింత పాటుపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికి సంగం డెయిరీ ప్రగతిని మాత్రం నిలువరించలేకపోయారు. అలాగే సంగం పట్టు సడలకుండా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సంగం ప్రస్థానాన్ని దక్షిణ భారతదేశం మొత్తానికి విస్తరించి పాల రైతులకు మరింత వెలుగులు తెచ్చేలా పాటుపడుతున్నారు.

ఇప్పటం పోరాటం.. స్ఫూర్తిదాయకం

- మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్


తనకు పెన్షన్ ఇప్పించాలని ఆత్మకూరులో లోకేశ్‌ను వేడుకుంటున్న వృద్ధురాలు


ఇప్పటంలో గ్రామ సమస్యల గురించి లోకేశ్‌కు వివరిస్తున్న స్థానికురాలు

మంగళగిరి, మే 10: అరాచక పాలనపై ఇప్పటం ప్రజలు చేసిన పోరాటం రాష్ట్ర చరిత్రలో మిగిలిపోతుందని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన నియోజకవర్గంలోని ఇప్పటం, వడ్డేశ్వరం, ఆత్మకూరు గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ సభలలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇప్పటంలో మాట్లాడుతూ పవనన్న సభకు భూములిచ్చారనే ఆక్రోశంతో ఇప్పటం గ్రామస్తులపై వైసీపీ పెద్దలు కక్ష కట్టి జేసీబీలతో ఇళ్ల కూలగొట్టారని గుర్తుచేశారు. అపుడు న్యాయం కోసం జనసేనతో కలిసి టీడీపీ పోరాడిందన్నారు. ఆ సందర్భంలోనే.. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అన్న నినాదం ఇప్పటం నుంచే మొదలైందన్నారు. ఇప్పటం గ్రామంలో రోడ్ల విస్తరణలో నష్టపోయిన బాధితులందరికీ తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోగా నష్టపరిహారాన్ని చెల్లిస్తామని హామీనిచ్చారు. అధికశాతం ఇళ్లను కోల్పోయినవారికి పూర్తిగా ఇళ్లను నిర్మించి ఇంటి తాళాలను అప్పగిస్తామన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇప్పటం గ్రామానికి వెళ్లాలని పవనన్న తనను కోరారని తెలిపారు. యువత భవిష్యత్తుకోసం.. రాష్ట్రాన్ని సమస్యల వలయం నుంచి తప్పించడం కోసమే తాము పొత్తులు పెట్టుకున్నామన్నారు. మనమధ్య చిచ్చులు పెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. అప్రమత్తంగా వుండి వారి కుటిలయత్నాలను అడ్డుకోవాలని పవనన్న తనతో చెప్పారని లోకేశ్ వివరించారు.

షరతులు లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తాం

జగన్ అధికారంలోకి వచ్చాక కుంటిసాకులతో పేదలకు సంక్షేమ పథకాలను కట్ చేస్తున్నారని లోకేశ్ ధ్వజమెత్తారు. తమ ప్రజాప్రభుత్వం వచ్చాక షరతులు లేకుండా గతంలో మాదిరి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామన్నారు. జగన్ మంగళగిరి సభలో తాను పదేపదే బటన్ నొక్కానంటూ అబద్ధాలను వల్లె వేశాడన్నారు. ఉత్తుత్తి బటన్ నొక్కి ప్రజలను మోసం చేయడం జగన్‌కు మొదటి నుంచి వున్న అలవాటన్నారు. అలాగే సంక్షేమం పేరుతో ప్రజలకు రూ.పది చేతుల్లో పెట్టి రూ.వంద కొట్టేయడం కూడ ఆయనకు వెన్నతో పెట్టిన విద్యేనన్నారు. గతంలో రూ.వందల్లో వచ్చిన కరెంటు బిల్లులు ఇపుడు రూ.వేలల్లో రావడానికి కారణాలేమిటని ప్రశ్నించారు. ఆర్టీసీ ఛార్జీలు, పెట్రోలు, డీజిల్, క్వార్టర్ ధరలన్నీ దారుణంగా పెంచిన ఘనత జగన్‌దేనన్నారు. తాను నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి తానేంటో రుజువు చేసుకుంటానని చెప్పారు. తన తల్లిదండ్రులు తనకు సేవ చేయడాన్ని గురించే నేర్పించారన్నారు. కరకట్ట కమలహాసన్ మాదిరి తనకు నటించడం చేతకాదన్నారు. పేదరికంలేని మంగళగిరిని తయారు చేయడమే తన లక్ష్యమన్నారు. దేశం మొత్తంమీద మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మార్చి చూపేందుకు నిరంతరం శ్రమించేందుకు తాను సిద్ధంగా వున్నానన్నారు. తన ఈ లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.

ఇదిలావుండగా ఇప్పటం గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై లోకేశ్ స్పందిస్తూ.. ఇప్పటం గ్రామానికి రోడ్డును వేసి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. కెఎల్ యూనివర్సిటీకి వెళ్లే రహదారిలో వున్న బకింగ్‌హామ్‌కాలువపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తామని, ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామని, బుడగ జంగాలకు కుల ధృవీకరణపత్రాలను ఇచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తామని వారికి లోకేశ్ హామీలను ఇచ్చారు. ఆత్మకూరులో గ్రామస్తులు వెలిబుచ్చిన పలు సమస్యలపై స్పందిస్తూ.. ఆత్మకూరులో పూర్తిస్థాయి అండర్‌గ్రౌండు డ్రైనేజి సౌకర్యాన్ని కల్పిస్తామని, గ్రామమంతటా పైప్‌లైన్లను వేయించి సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడతామని, శిథిలావస్థలకు చేరిన వంతెనలను పునర్నిస్తామని, కోవిడ్ సమయంలో సేవలను అందించిన పారా మెడికల్ సిబ్బందికి బకాయిలను చెల్లిస్తామని, రోడ్డు విస్తరణలో నిరాశ్రయులైన వారికి స్థలాలు కేటాయించి పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని, పానకాలస్వామి ఆలయం వద్దకు ఉచిత ఎలక్ట్రిక్ బస్సును ఏర్పాటుచేయిస్తామని, కౌలురైతు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసి సాయం అందిస్తామని, మంగళగిరికి మరిన్ని ఐటీ కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలను ఇప్పిస్తామని లోకేశ్ హామీలను ఇచ్చారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు, పవనన్నతో పోరాడి నిధులు తెచ్చి మంగళగిరిని అభివృద్ధి చేయాలంటే వారికి తన మెజారిటీని గుర్తు చేయాల్సి వుంటుందన్న సంగతిని ప్రజలు గమనంలో వుంచుకుని తనకు అత్యధిక మెజారిటీని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


వడ్డేశ్వరంలో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న లోకేశ్

ఎన్నికలపై.. నిరంతర నిఘా

- పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా


ఎన్నికల నిర్వహణ పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా

గుంటూరు సిటీ, మే10: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా, అడిషనల్ డీజీపీ ఎస్‌బాగ్చి, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠి త్రిపాఠి, జిల్లా ఎస్పీ తుషార దూడి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ సత్యార్థ అనిరుద్ధ పంకజ్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు మృణాల్ కుమార్ దాస్‌తో కలసి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఎం.వేణుగోపాల్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక పోలీసు పరిశీలకులకు వివరిస్తూ జిల్లాలో 17,91,543 మంది ఓటర్లు ఉన్నారని, 1915 పోలింగ్ బూత్‌లు వున్నాయన్నారు. వీటిలో 372 క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, 69శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వివిధ ప్రక్రియలను పర్యవేక్షించడానికి 17 బృందాలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటును సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, సీవిజిల్ ఫిర్యాదులు తదితర అంశాలను వివరించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బందోబస్తు ప్రణాళికలను వివరించారు. అనివార్య సంఘటనలను తక్షణమే అదుపు చేయడానికి నియమించిన బృందాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఆవరణలోకి లోపలకు, వెలుపలకు వెళ్ళే మార్గాల వద్ద కెమెరాలతో పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలన్నారు. బైండోవర్ చేసిన వ్యక్తులను ఉదయాన్నే ఓటు వేయించి పోలీస్‌స్టేషన్‌లో పోలింగ్ ముగిసే వరకు అదుపులో వుంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తరువాతే అనుమతించాలన్నారు. పోలింగ్ పూర్తి అయిన తరువాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించే కాన్వాయ్ పూర్తిగా రికార్డు అయ్యేలా పైలెట్ వాహనంపై కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు పాల్పడే వారు, దౌర్జన్యాలు చేసే అసాంఘిక వ్యక్తులపై కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సంఘటనలను జిల్లా స్థాయి అధికారులతో పాటు, ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా, పక్షపాతంగా వ్యవహరించే అధికారులపై తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ట్రైనీ ఎస్పీ మనోజ్ హెగ్డే, ఈస్ట్ అడిషనల్ ఎస్పీ ఎస్.ఎన్.విశ్వనాథ్, అడిషనల్ ఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), జి.రమణ మూర్తి (అడ్మిన్), కె.శ్రీనివాసరావు (లా అండ్ ఆర్డర్) ఎస్డీపీవోలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

మూడు జెండాలతో సైకిల్‌పై ప్రచారం

తాడేపల్లి టౌన్, మే 10: టీడీపీ కూటమి మూడు జెండాలతో ఐదు పెడల్స్ సైకిల్‌పై వినూత్నంగా కార్యకర్తలు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గుంటూరు ఏటీ అగ్రహారం నుంచి విజయవాడ వరకు ఈ ప్రచారం నిర్వహిస్తున్నామని తాడేపల్లిలో విలేకరులకు తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి జరిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామని టీడీపీ కార్యకర్తలు సీహెచ్ చంద్రశేఖర్, షేక్ బాజి, రాజేష్ బాబులు తెలిపారు.


ఐదు పెడల్స్ సైకిల్‌పై మూడు పార్టీల జెండాలతో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఓటుకు పదివేలిస్తారట.. అది మీ సొత్తే.. తీసుకోండి

- సైకిల్‌పైనే ఓటు ముద్ర వేయండి
- ఓటర్లకు లోకేశ్ పిలుపు

మంగళగిరి, మే 10: మంగళగిరి, కుప్పం నియోజకవర్గాలలో జగన్ డబ్బును ఏరులా పారిస్తున్నాడు. అదంతా పాపపు సొమ్మే! ఇసుక, మద్యం, గంజాయిలో అడ్డగోలుగా దోచుకున్న డబ్బది. ఈ రెండు నియోజకవర్గాలలో ఓటుకు రూ.పదివేల వంతున పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారముంది. ఏం ఫర్వాలేదు.. ఓటర్లు నిరభ్యంతరంగా ఆ డబ్బులను తీసుకోవచ్చు. అదంతా జనం నుంచి దోచుకున్న డబ్బేనని మంగళగిరి కూటమి అభ్యర్థి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూరులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రచ్చబండ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒక్కో నియోజకవర్గంలో ఓట్ల కొనుగోలుకు రూ.300 కోట్లను కేటాయించారు. అయిదేళ్లగా ఒక్కో ఓటరు నుంచి జగన్ లక్ష రూపాయల వంతున దోచుకుని ఇపుడు ఆసొమ్ములో పదోవంతును మళ్లీ మీకే ఇస్తున్నాడని చెప్పారు. ఆ డబ్బును ఓటర్లు తీసుకుని ఓటుమాత్రం రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించే తమకే వేయాలని కోరారు. మంగళగిరికి కంపెనీలు వచ్చే అవకాశమే లేదని కరకట్ట కమలహాసన్ చెబుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కంపెనీలను తీసుకురావడం బహుశా వైసీపీ వారికి సాధ్యం కాకపోవచ్చు. తమకు మాత్రం అది సాధ్యమేనన్నారు. గతంలో హైదరాబాద్‌లోనూ, మంగళగిరి, గన్నవరం ప్రాంతాలకు ఐటీ పరిశ్రమలను తెచ్చిన ఘనత తమకు ఉందన్నారు. ఆ ఆత్మవిశ్వాసంతోనే మళ్లీ మంగళగిరికి మరిన్ని ఐటీ కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. మంగళగిరిలో గతంతో తాను ఐటీ మంత్రిగా పదికిపైగా ఐటీ కంపెనీలను తీసుకొస్తే జగన్ ప్రభుత్వం వాటన్నింటిని తరిమేసి యువతకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. ఇప్పటికి ఫైకేర్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ 580 మంది ఉద్యోగులతో విజయవంతంగా నడుస్తుందన్నారు. కళ్లముందర కనిపించేవాటిని కూడ కరకట్ట కమలహాసన్ చూడలేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తమకు తెలియడం లేదన్నారు. నటన, అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మభ్యపెట్టలేరన్నారు. అభివృద్ధి చేయాలనే సంకల్పమే ఉంటే ఎంతైనా చేయొచ్చునన్నారు. మరో నెలన్నర రోజుల్లో ప్రజాప్రభుత్వం వచ్చిన వెంటనే రాజధాని అమరావతి పనులను ప్రారంభించి యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ప్రతియేటా సింగిల్ జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ప్యూన్ నుంచి గ్రూప్-1 వరకు ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని లోకేశ్ హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షులు తోట పార్థసారధి, తమ్మిశెట్టి జానకీదేవి, నందం అబద్దయ్య, తిరువీధుల బాపనయ్య, గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

● ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు, మహిళలు



కట్రపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

పెదనందిపాడు, మే 10: మండలపరిధిలోని కట్రపాడు, నాగులపాడు, కొప్పర్రు, వరగాని గ్రామాల్లో గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, మహిళలు గ్రామాల్లో తిరుగుతూ టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, మాజీ జడ్పీటీసీ బత్తిని శారదావేణు, గ్రామ అధ్యక్షుడు అనంతనేని రమేష్, బండి నాగబాబు, యేలూరి గోపీప్రసాద్, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ కమ్మ నాగ మల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పాటిబండ్ల రాంబాబు, ఆళ్ళ రాజారావు, భీమినేని రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసబాట పడుతున్న వైసీపీ నాయకులు



వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

పెదనందిపాడు, మే 10: మండలపరిధిలోని ఆయా గ్రామాల వైసీపీ నాయకులు టీడీపీలోకి వలస బాటపడుతున్నారు. మండలపరిధిలోని నాగులపాడు ఎస్టీకాలనీలో 15 కుటుంబాలు పీఏసీఎస్ చైర్మన్ పాటిబండ్ల రాంబాబు ఆధ్వర్యంలో శనివారం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు బి.నాగబాబు, నాయకులు పాటిబండ్ల నాగరాజు, ఆళ్ళ రాజారావు, భీమినేని రవి, గొల్లపూడి వాసు, గొల్లపూడి కోటయ్యచౌదరి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యం



పొన్నెకల్లు బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తాడికొండ, మే 10: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం పొన్నెకల్లు బీసీ కాలనీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికి గ్యాస్, పేదలకు మూడు కోట్ల ఇళ్ల కట్టించడమే బీజేపీ లక్ష్యమన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇస్తారని తెలిపారు. ముద్రా రుణాలను రూ20 లక్షల వరకు పెంపు చేశారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ బిలాల్, ఆరుద్ర గోపి, గుంటుపల్లి కృష్ణ, సరిపూడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్ రైజింగ్ స్టార్స్‌కు విశేష స్పందన



మంగళగిరి ఏసీఏ స్టేడియంలో ట్రయల్స్‌కు హాజరైన యువకులు

మంగళగిరి సిటీ, మే 10: ప్రతిభ కలిగి గుర్తింపు లేని యువ క్రికెటర్ల కోసం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఏపీఎల్ రైజింగ్ స్టార్స్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంతోపాటు విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం బీ-గ్రౌండు, కడపలోని వైఎస్ ఆర్ ఏసీఏ స్టేడియంలో నిర్వహించిన ట్రయల్స్‌కు రాష్ట్రం నలు మూలల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరైనట్టు ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఏపీఎల్ వేలంలో చోటు దక్కని వారు ట్రయల్స్‌లో సత్తాచాటి ఏపీఎల్ సీజన్-3లో స్థానం దక్కించుకునేందుకు ఇదొక చక్కటి అవకాశమన్నారు. ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి భవిష్యత్తులో వారికి మంచి అవకాశాలు కల్పించేందుకు ఏసీఏ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

దళితులను హత్య చేసిన వారికే సీట్లు, పదవులా?

● ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవులు

మంగళగిరి సిటీ, మే 10: రాష్ట్రంలో 22 మంది దళితులను హత్య చేసిన వారికే సీఎం జగన్ సీట్లు, పదవులు కట్టబెడుతున్నారని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు ఆరోపించారు. మంగళగిరిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ మాత్రం మేలు చేయని జగన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. పేదలతో నాశిరకం, కల్తీ మద్యం తాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆర్భాటంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి కేటాయించిన రూ.వేల కోట్ల నిధులను పక్కదారి పట్టించి దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేల కోట్లు దండుకున్న జగన్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు మాట్లాడుతూ విదేశీ విద్య పథకానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకోవడం దుర్మార్గమన్నారు. విదేశీ విద్య పథకం ద్వారా చదువుతున్న 2,500 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోవడంతో వారంతా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి దళితుల ఉన్నతిని అడ్డుకుంటున్న జగన్‌కు సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

● ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్



ఫిరంగిపురం రోడ్ షోలో పాల్గొన్న తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, మే 10: రాష్ట్రంలో ఐదు సంవత్సరాల పాటు అరాచక పాలన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాలని తాడికొండ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేపూడి మార్కెట్ యార్డు నుంచి ఫిరంగిపురం ఎస్టీ కాలనీ వరకు సాగిన ప్రజా చైతన్యయాత్ర రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తులను వైసీపీ కొల్లగొట్టే ప్రమాదం ఉందన్నారు. భూ యజమానికి కేవలం నకళ్లు ఇచ్చి అసలు పత్రాలు ప్రభుత్వం దగ్గరే పెట్టుకొని అమ్మకాలు, కొనుగోలుకు తావు లేకుండా పూర్తిగా భూములను కబ్జా చేసుకొనే ఎత్తుగడ చేస్తున్నారని ఆయన విమర్శించారు. దళితులపై దాడులు, అత్యాచారాలు, కూటమి ప్రభుత్వంలో సాగనివ్వబోమన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కొనసాగించి వారిని ఆదుకుంటామన్నారు. జగన్ రద్దు చేసిన 27 పథకాలు పునరుద్ధరించనున్నామన్నారు. మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. అలాగే ఫిరంగిపురంలోని కార్మెట్ మాత ఆలయానికి గల కొండకు ఘాట్ రోడ్డు నిర్మాణం చేస్తానన్నారు. విజ్ఞాన్‌పురంనకు కోటి రూపాయలతో కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాలతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే శాంతియుత వాతావరణంతో పాటు అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

రోడ్‌షోలో జన నీరాజనం

ఫిరంగిపురంలో శుక్రవారం జరిగిన రోడ్ షోలో శ్రావణ్‌కుమార్‌కు జనం నీరాజనం పలికారు. కిలో మీటరు పొడవున యువత, మహిళలు, కార్యకర్తలతో ర్యాలీ, డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, బాణసంచా పేలుస్తూ కోలాహలంగా సాగింది. దీంతో ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు డివైడర్ రెండో వైపున వాహనాలను తరలించారు. విజ్ఞానపురం యువకులు 50మంది తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, చెక్కా హనుమంతరావు, నల్లజర్ల అప్పయ్య, చిట్టా వీరారెడ్డి, వజ్రాల అయ్యపరెడ్డి, కోటిరెడ్డి, గుర్రాల శివయ్య, కొనన నాగరాజు, కొలగాని కొండలు, కటికల అప్పారావు, గొర్రెపాటి చంద్రశేఖరరావు, విశ్వనాథరెడ్డి, ఆరే పున్నారెడ్డి, వేల్పుల అంకారావు, ఏపూరి పూర్ణ, బందనాదం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ్ కుమార్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

జగన్ అసమర్థ పాలనలో బీసీలకు తీరని నష్టం

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

మంగళగిరి, మే 10: జగన్ అసమర్థ పాలనలో బీసీలకు తీరని నష్టం వాటిల్లిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. స్వర్గీయ ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీలకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించి 16,800 మంది బీసీలను వివిధ పదవులకు దూరం చేశారని మండిపడ్డారు. ఐదేళ్లలో బీసీలపై హత్యలు, దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. 26 బీసీ సామాజికవర్గాల వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లు హేమసుందరరావు మాట్లాడుతూ బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించకుండా మోసం చేసిందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో బీసీల భూములు 8 వేల ఎకరాలను లాక్కుందని ఆరోపించారు. సీఎం జగన్ తాత రాజారెడ్డి హయాం నుంచి బీసీలపై దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 300 మంది బీసీలను హత్య చేశారని, సుమారు 26 వేల మందిపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల ఈశ్వరరావు, బీజేపీ గీత సెల్ కన్వీనర్ అనుమోలు ఏడుకొండలు, భట్రాజు సాధికార సమితి కన్వీనర్ ప్రసన్నాంజనేయ రాజు, నేతలు గుమ్మా బాబు, పీ కోట య్య, గోవాడ దుర్గారావు, విన్నకోట శ్రీనివాసరావు, వాకా మాధవ రావు, గాదె లక్ష్మణరావు, చలమలశెట్టి ప్రదీప్, తాడికొండ వెంకటేష్, గంజి అంకమ్మరావు, వేముల శివ, జయలక్ష్మి, కందునూరి ప్రసాద్, కంచి వెంకటేశ్వరరావు, వింజమూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు టీడీపీ వైపే : దానబోయిన



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు

తాడేపల్లి టౌన్, మే 10: తెలుగుదేశం పార్టీవైపే బీసీలంతా ఉన్నారని బీసీలకు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం టీడీపీ నేత కళ్లం బాపిరెడ్డి కార్యాలయం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి పూర్తిగా నడిపించే వరకు బాధ్యత తీసుకుంది బీసీ సామాజిక వర్గమేనన్నారు. వైసీపీ ఎన్నికలకు ముందు బీసీలకు వాగ్దానాలు చేసి గెలిచాక వాటిని తుంగలో తొక్కిందని వ్యాఖ్యానించారు. ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఏటా రూ.30 వేల కోట్లతో బీసీ సప్లయ్ ద్వారా బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపు చేసి బీసీ కాలనీలలో మౌలిక సదుపాయాలు, వారి సమగ్ర సాధికారితకు రూపకల్పన చేయడానికి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వడంతో బీసీలు తిరిగి తెలుగుదేశం గూటికి చేరుతున్నారన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు రూ.లక్షా 50 వేల కోట్ల నిధుల కేటాయింపు చారిత్రక నిర్ణయమన్నారు. వచ్చే ఎన్నికల్లో నారా లోకేశ్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నేత కళ్లం బాపిరెడ్డి మాట్లాడుతూ మంగళగిరికి మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల, ఆర్కే చేసిందేమీ లేదన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారని ప్రజలకు జగన్నాటకాలు అర్థమయ్యాయని, జరగబోయే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు.

309 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 10: స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 309 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ము లు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,200 గరిష్ఠధర రూ.14,350 మోడల్‌ధర రూ.14,075 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,200 గరిష్ఠధర రూ.14,350, మోడల్‌ధర రూ.14,025 పలికాయి.

చిర్రావూరులో శైలజారాణి విస్తృత ప్రచారం



చిర్రావూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ శైలజారాణి

తాడేపల్లి, మే 10: తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలో గురువారం రాత్రి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, దివంగత టీడీపీ నేత దండమూడి మనోజ్‌కుమార్ సతీమణి దండమూడి శైలజారాణి, గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు అంకం కాళీకృష్ణ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నారా లోకేశ్‌ను, ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కాగా మాలపల్లి సెంటర్‌లో గ్రామ ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్ ఆధ్వ ర్యంలో టీడీపీ కార్యాలయం పునఃప్రారంభోత్సవం సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర సంపద కోసం రాజధానికి భూములు



తాడికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, మహిళలు

తాడికొండ, మే 10: రాష్ట్ర సంపద కోసం రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు భూములు ఇచ్చామని రైతులు స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతే ఐదు కోట్ల మంది ఆకాంక్ష, హైకోర్టు తీర్పును అమలు చేయాలని రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆట ఆడుతూ అన్నదాతను నాలుగేళ్లుగా నడిరోడ్డు మీద నిలబెట్టాడన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను బలి చేస్తున్నారన్నారు. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. అందుకు తగిన శిక్ష అనుభవించక తప్పదన్నారు.

కాపుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కాపు నాయకులు

మంగళగిరి సిటీ, మే 10: సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో కాపుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని మంగళగిరి నియోజకవర్గ కాపు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రబాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాపు సంఘాల నేతలు గోవాడ దుర్గారావు, విన్నకోట శ్రీనివాసరావు, తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. కాపులకు ఈబీసీ కోటాలో టీడీపీ ప్రభుత్వం కేటాయించిన 5శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా జగన్ తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. కాపులను సామాజికంగాను, ఆర్థికంగాను బలహీనపరచాలన్న దురుద్దేశంతోనే రిజర్వేషన్లను అమలు చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2014-19 మధ్య కాలంలో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. జగన్ ఏటా రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.పది వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. జగన్ మోసాలపై కాపులంతా అప్రమత్తంగా ఉండి, ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్ని కల్లో మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాపు సంఘాల నేతలు కాపరౌతు సుందర య్య, బాణాల నాగేశ్వరరావు, ఆకుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంగళగిరి సిటీ, మే 10: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం నవులూరు గ్రామ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. మక్కెవారి పేట, గోలి వారి తోట, బాపనయ్యనగర్, ఈఎస్ ఆర్ గార్డెన్స్, టిడ్కో సముదాయాల్లో ఉదయం 7 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు

తుళ్లూరు, మే 10: ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులను, పోలీసులను బూతులు తిట్టి విలేకరిపై దాడి చేసిన వైసీపీకి చెందిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై మరో కేసు నమోదైంది. గురువారం అర్ధరాత్రి తుళ్లూరులోని ఓ దాబా హోటల్‌లో పని చేసే వారిని కత్తులతో బెదిరించి, కొట్టి వీడియోలు రికార్డు చేసుకోవటంపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 448, 323, 506 రెడ్ విత్34 కింద కేసు నమోదు చేసినట్టు సీఐ సుబానీ శుక్రవారం తెలిపాడు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

● ఆర్యవైశ్యసంఘు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుండూరు ఉమామహేశ్వరరావు

● ఆర్యవైశ్యుల స్థలాలు, సత్రాల కబ్జా ● 20 చోట్ల దాడులు జరిగినా స్పందించని ప్రభుత్వం

దుగ్గిరాల, మే 10: ఆర్యవైశ్యులపై దాడులను అరికట్టక పోగా వారి ఆస్తులను కబ్జా చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆర్యవైశ్యసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుండూరు ఉమా మహేశ్వరరావు అన్నారు. దుగ్గిరాలలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20చోట్ల ఆర్యవైశ్యులపై దాడులు జరిపి వారి ఆస్తులను లాక్కున్నారన్నారు. ముఖ్యమంత్రి నొక్కిన బటన్‌లలో ఒక్కబటన్ కూడా ఆర్యవైశ్యులకు ఉపయోగపడలేదని, ఆర్యవైశ్యులందరూ ఏకతాటిపైకి వచ్చి తామంతా రెండే, రెండు బటన్‌లు నొక్కి తమ తీర్పును తెలియ జేస్తామన్నారు. అనేకచోట్ల ఆర్యవైశ్యుల ఆస్తులు కబ్జాకు యత్నించారని, ఆస్తులకు సంబంధించి, లాండ్ టైటిల్‌లో ముఖ్యమంత్రి ఫోటోలు వేసుకోవడం భావ్యం కాదన్నారు. రాబోయే ప్రభుత్వం వాసవీ అమ్మవారి ఆత్మార్పణదినాన్ని అధికారికంగా ప్రకటిస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పడం సంతోషదాయకమన్నారు. కొణిజేటి రోశయ్య మృతికి కనీసం సరైన రీతిలో నివాళులర్పించలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వంలో కనిపించాయన్నారు. గత ప్రభుత్వాలన్నీ ఆర్యవైశ్యులను గౌరవించాయని, వైసీపీ ప్రభుత్వం తమకు కనీస గుర్తింపు లేకుండా చేసిందన్నారు. గారపాటి కోటేశ్వరరావు(చిన్నా), సంకా లక్ష్మీనరసింహమూర్తి, చుండూరు లక్ష్మణ్‌కుమార్, భాస్కరుని వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రఘునాథ్‌గుప్తా, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న కొలకలూరు గ్రామస్థులు

కూటమి ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 10: కూటమి ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వారిని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనతో ప్రజలు విసుగుచెందారని చెప్పారు. సొంత పార్టీలో ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఆ పార్టీ సిద్ధాంతాలు, పోకడలతో విసుగుచెంది నిజమైన అభివృద్ధి, సంక్షేమం చేయగలిగే టీడీపీవైపు నడుస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రాన్ని, ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని ఆలపాటి పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు హెచ్‌సీవీ ఎండీ కరణం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, నల్లిబోయిన నాగేశ్వరరావు, గద్దే వెంకట్రావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 10: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. అన్నదాత సుఖీభవ సభ్యులు రాచాబత్తుని శైలేష్ జన్మదినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులు శ్రీనివాసరావు, విద్యుల్లత, గద్దె పిచ్చయ్య జ్ఞాపకార్థం వారి భార్య సీతామహాలక్ష్మి, కుమారుడు, కోడలు వెంకట అమరనాగేశ్వరావు, అనిత, కుటుంబ సభ్యుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవీ ప్రతాప్, కుర్రా శ్రీనివాసరావు, సందీప్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెంచుపేటలో...

తెనాలి, మారీసుపేట మే 10: స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం కృష్ణ రాజగోపాల్ చారిటబుల్ ట్రస్ట్ వారు రోగులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు సాతులూరి శ్రీనివాస శేషసాయి, గీతా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ దాతల, ట్రస్ట్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా వేసవిలో రోగుల దాహార్తిని తీర్చడానికి చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంపద కోసం రాజధానికి భూములు

● రైతులు, రైతు కూలీలు మహిళలు ● కొనసాగుతున్న నిరసనలు



తాడికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, మహిళలు

తాడికొండ, మే 10: రాష్ట్ర సంపద కోసం రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు భూములు ఇచ్చామని రైతులు స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతే ఐదు కోట్ల మంది ఆకాంక్ష, హైకోర్టు తీర్పును అమలు చేయాలని రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆట ఆడుతూ అన్నదాతను నాలుగేళ్లుగా నడిరోడ్డు మీద నిలబెట్టాడన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను బలి చేస్తున్నారన్నారు. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. అందుకు తగిన శిక్ష అనుభవించక తప్పదన్నారు.

మనోహర్‌కు ఘన స్వాగతం





మనోహర్‌కు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు, జగ్గడిగుంటపాలెంలో ఎద్దులబండిపై అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న మనోహర్

తెనాలి రూరల్, మే 10: వైసీపీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందనటానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు ఎన్నికల ప్రచారంలో ప్రజల బ్రహ్మరథం పట్టడమే నిదర్శనంగా కనిపిస్తోంది. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నాదెండ్ల మనోహర్ మండలంలోని జగ్గడిగుంటపాలెం, ప్రగడకోటయ్యనగర్, పెదరావూరు గ్రామాల్లో పర్యటించారు. ఆయన పర్యటించిన ప్రతి గ్రామంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మనోహర్‌కు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారుతులు పట్టగా కూటమి శ్రేణులు గజమాలలతో ఎక్కడికక్కడ మనోహర్ నాయకత్వాన్ని బలపరుస్తూ రాబోయే ఎన్నికల్లో విజయసంకేతాన్ని చాటుతూ వచ్చారు. మండలంలోని జగ్గడిగుంటపాలెంలో మనోహర్‌ను ఉమ్మడి పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై ఎక్కించి గ్రామంలో పర్యటన చేయించారు. అడుగడుగునా గ్రామంలో మనోహర్‌కు ఘన స్వాగతం లభించింది. అనంతరం పెదరావూరులో కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు మనోహర్‌కు స్వాగతం పలికి ఆయన వెంట ఎన్నికల ప్రచారం హుషారుగా సాగించారు. ఆ గ్రామంలో మనోహర్‌కు మద్దతు పలుకుతూ గ్రామస్తులు పెద్దఎత్తున మనోహర్ పాదయాత్రలో పాల్గొనడం విశేషం, ప్రగడ కోటయ్య నగర్ మీదుగా ప్రచారం సాగింది.

తెనాలి ప్రాంతంలో రౌడీయిజాన్ని అంతం చేస్తా: మనోహర్

తెనాలి రూరల్, మే 10: గత ఐదేళ్ళుగా తెనాలి ప్రాంతంలో పెరిగిపోయిన రౌడీయిజాన్ని అంతంచేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పి ప్రజలకు ప్రాంతానికి మంచి చేయడమే కూటమి అభ్యర్థుల లక్ష్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగు జనచైతన్యపాదయాత్రలో భాగంగా శుక్రవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి పార్టీల శ్రేణులతో కలిసి మండలంలోని పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, ప్రగడకోటయ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మనోహర్ ప్రచారానికి ఉమ్మడి పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కూటమి వెంటే మేమంతా అంటూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పేదలందరికీ అవసరమైన స్థలాలు, ఇల్లు నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రజలకు మేలు చేసేలా కూటమి అనేక సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచిందని వాటి ద్వారా ప్రజలకు ఆర్థిక భారం తగ్గి మేలు జరుగుతుందన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. గ్రామాల్లో కమ్యునిటీ హాళ్లు, డిజిటల్ లైబ్రరీస్, రైతులకు, కౌలు రైతులకు మేలు జరిగేలా ప్రణాళికతో ముందుకు నడవనున్నట్లు తెలిపారు. పించన్లకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందిస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలు తెలిపిన ప్రతి సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై మీరు ఓటు వేయడంతోపాటు మీ చుట్టు ఉన్న వారితో కూడా రాష్ట్ర భవిష్యత్తుకు కూటమి ఆవశ్యకతను వివరించి ఓటు వేయించాలని కోరారు. పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే వైసీపీ ప్రభుత్వ అక్రమాలకు చెక్: ధూళిపాళ్ళ



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 10: ఓటు అనే ఆయుధం వినియోగించుకోవటం ద్వారానే వైసీపీ ప్రభుత్వ అక్రమాలకు చెక్ చెప్పవచ్చని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని జడవల్లి గ్రామానికి చెందిన పంచాయితీవార్డు మెంబర్ పిల్లి జనార్థన్, పిల్లి కుమారి, పిల్లి జేమ్స్ శుక్రవారం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో పరిశ్రమలను వేధించి తరిమేయటం ద్వారా యువతకు ఉపాధి లభించటం లేదన్నారు. ప్రజలు అన్ని రకాలుగా అవస్థలు ఎదుర్కొంటున్నట్లు ఆరోపించారు. రానున్న కూటమి ప్రభుత్వంలో ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా మ్యానిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. ప్రజలకు మేలు జరిగే కూటమి అభ్యర్థులను గెలిపించాలని నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసం కూటమిని గెలిపించాలి : వైదీప్తి

పొన్నూరు టౌన్, మే 10: రాష్ట్ర భవిష్యత్తు తరాల కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. మండల పరిధిలోని జడవల్లి గ్రామంలలో శుక్రవారం కూటమి అభ్యర్థుల విజయం కోసం వైదీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లిన వైదీప్తి ప్రజలను పలకరించి మ్యానిఫెస్టోను పంచిపెట్టారు. అనంతరం వైదీప్తి మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రంలో ఉపాధి లేక యువత వలస బాటపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను ప్రభుత్వం తరిమివేయటంతో పరిశ్రమలు అన్ని పక్క రాష్ట్రాలకు తరలివెళ్లి యువతకు అవకాశాలు లేకుండా పోయాయన్నారు. అలాగే ప్రజలకు సౌకర్యాలు కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెడతానని చంద్రబాబు మాట ఇచ్చారని గుర్తుచేశారు. 20లక్షల ఉద్యోగాలను భర్తీ చేయటమే కాకుండా నిరుద్యోగ యువతకు భృతి కల్పించటమే కాకుండా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే మహిళల కోసం మూడు వంట గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇవ్వటంతో ఉచిత బస్సు ప్రయాణం, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం, పేదల కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా చంద్రన్న బీమా వంటి పథకాలను అమలు చేయనునట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకాకానిలో వైసీపీకి భారీ షాక్

● నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన 70 కుటుంబాలు

పెదకాకాని, మే 10: మండల కేంద్రమైన పెదకాకానిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పెదకాకానిలోని పాతూరు ప్రాంతంలో వైసీపీకి చెందిన పుప్పాల సాంబశివరావు, షేక్ సుభాని ఆధ్వర్యంలో సుమారు 70 కుటుంబాలు పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం వైసీపీ నాయకులను నరేంద్రకుమార్ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని నరేంద్ర గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.



జడవల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న ధూళిపాళ్ళ వైదీప్తి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై

న్యాయవాదుల సుదీర్ఘ పోరాటం

● 93 రోజులు నిరాహార దీక్షలతో అలుపెరుగని పోరు

● ఎన్నిల కోడ్ వచ్చాక దీక్షలకు నిరవధిక వాయిదా

● తెనాలి కోర్టులలో విధుల బహిష్కరణ



తెనాలిలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా దీక్షలు చేసిన బార్ అసోసియేషన్ సభ్యులు (పాతచిత్రం)

తెనాలి, మే 10, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా నిలిచిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్. దీనికోసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేముందు రోజు వరకు తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు అలుపెరుగని పోరాటమే చేశారు. 93 రోజులు కోర్టు కేసులకు కూడా హాజరు కాకుండా విధులు బహిష్కరించి మరీ నిరాహార దీక్షలు చేపట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/23 అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల పైసాపైసా కూడబెట్టుకుని కొనుక్కున్న భూమిపై సొంతదారులకు ఏ హక్కూ లేకుండా పోతుందని, బలమున్నవాడిదే రాజ్యమనే విషయాన్ని జనానికి తెలియచెప్పాలని, జనంలో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతోనే తాము ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా పోరాడామని తెనాలి న్యాయవాదులు చెప్పారు. ఇది ప్రభుత్వం దురుద్దేశంతో తీసుకొచ్చిన నల్లచట్టమని, దీనిని వెంటనే రద్దుచేయాలనేది వారి డిమాండ్. తాము చేస్తున్న ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ గతంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలసి, చట్టం ఎంత ప్రమాదకరమో కూడా వివరించామన్నారు. అందరూ దీనిపై సానుకూలంగా స్పందించారని, ముగ్గురు నేతలు జగన్ చేసిన కుట్రను తెలుసుకుని విస్తుపోయారని, ఇప్పుడు ఎన్నికల వేళ దీనిపైనే ప్రతి నేతా మాట్లాడుతుంటే మా పోరాటానికి సార్థకత చేకూరిందనుకుంటున్నామని న్యాయవాది హరిదాసు గౌరీశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత నేతలే తీసుకోవాలని, ఇకపై ఈ చట్టం రాకుండా చేయగలిగితేనే ఆస్తులకు రక్షణ ఉంటుందని న్యాయవాదులు జగదీశ్వరాంబ, విజయకుమారిలు అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ పోరాటం 93 రోజులు సాగితే జనం నుంచి కూడా మంచి స్పందనే వచ్చిందని, అవగాహన కల్పించుకునేందుకు చాలామంది ప్రయత్నించారని, చట్టం తీవ్రత తెలిశాక చాలామంది ప్రభుత్వ కుటిల ఆలోచనలపై మండిపడ్డారన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ పెద్దలు, సలహాదారులు చట్టాన్ని మంచిచేసేదిగానే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, దీనిపై కావాలనే ప్రతిపక్షాలు కుట్రకోణంలో జనానికి వివరిస్తున్నాయంటూ బుకాయించటంపైనా న్యాయవాదులు మండిపడ్డారు. ఎన్నికల తర్వాతకూడా ఈ చట్టం రద్దుకాకపోతే పోరాటం తప్పదని, ప్రస్తుతానికి నిరవధిక వాయిదానే వేశామని, తర్వాత అవసరమైనే కొనసాగించేందుకు, ప్రభుత్వాలపై పోరుకు వెనకాడేదిలేదని వారు స్పష్టం చేశారు.

బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు

తుళ్లూరు, మే 10: ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను, పోలీసులను బూతులు తిట్టి విలేకరిపై దాడిచేసిన వైసీపీకి చెందిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై మరో కేసు నమోదైంది. గురువారం అర్ధరాత్రి తుళ్లూరులోని ఓ దాబా హోటల్‌లో పని చేసే వారిని కత్తులతో బెదిరించి, కొట్టి వీడియోలు రికార్డు చేసుకోవటంపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 448, 323, 506 రెడ్ విత్34 కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుభానీ శుక్రవారం తెలిపాడు.

దళితులను హత్య చేసిన వారికే సీట్లు, పదవులా?

● ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవులు

మంగళగిరి సిటీ, మే 10: రాష్ట్రంలో 22మంది దళితులను హత్యచేసిన వారికే సీఎం జగన్ సీట్లు, పదవులు కట్టబెడుతున్నారని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు ఆరోపించారు. మంగళగిరిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ మాత్రం మేలు చేయని జగన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. పేదలతో నాశిరకం, కల్తీ మద్యం తాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆర్భాటంగా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి కేటాయించిన రూ.వేలకోట్ల నిధులను పక్కదారి పట్టించి దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేల కోట్లు దండుకున్న జగన్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు మాట్లాడుతూ విదేశీ విద్య పథకానికి బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకోవడం దుర్మార్గమన్నారు. జగన్‌కు సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కాపుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కాపు నాయకులు

మంగళగిరి సిటీ, మే 10: సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో కాపుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని మంగళగిరి నియోజకవర్గ కాపు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రబాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాపు సంఘాల నేతలు గోవాడ దుర్గారావు, విన్నకోట శ్రీనివాస రావు, తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కాపు కార్పొ రేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. కాపులకు ఈబీసీ కోటాలో టీడీపీ ప్రభుత్వం కేటాయించిన 5శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా జగన్ తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. కాపులను సామాజికంగాను, ఆర్థికంగాను బలహీన పరచాలన్న దురుద్దేశంతోనే రిజర్వేషన్లను అమలు చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2014-19 మధ్య కాలంలో రూ.4వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. జగన్ ఏటా రూ.2వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.పది వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. జగన్ మోసాలపై కాపులంతా అప్రమత్తంగా ఉండి, ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్ని కల్లో మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాపు సంఘాల నేతలు కాపరౌతు సుందరయ్య, బాణాల నాగేశ్వరరావు, ఆకుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

● టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ మురళి



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, రవినాయక్, ఎలీషా తదితరులు

తెనాలి, మారీసుపేట మే 10: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు నాదెండ్ల, పెమ్మసానిని గెలిపించాలని టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి కోరారు. సుల్తానాబాద్‌లోని 29వ వార్డులో శుక్రవారం టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరుగుతూ బ్యాలెట్ నమూనాను చూపుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన జగన్‌మోహనరెడ్డి ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలనకు తెరలేపారని విమర్శించారు. పేదవాడికి కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్‌లను మూసివేసి పేదవాడి కడుపుకొట్టాడని ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యంచేసి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరంచేసిన ప్రభుత్వం ఈ వైసీపీ ప్రభుత్వమన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యంచేసి దోపిడీకి తెరలేపిందని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నా, సంపద సృష్టించాలన్న ఒక్క చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. ప్రజలందరూ మే 13న జరిగే ఎన్నికలలో తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిట్రా యుగంధర్, రమావత్ రవినాయక్, శంకర్‌నాయక్, మహేష్‌నాయక్, ఎలీషా, కుంచాల నారాయణ, అనీల్, సురేష్, భాస్కర్, అయ్యప్ప, హనుమంత్, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పెమ్మసాని, మనోహర్‌లను గెలిపించుకుందాం..

● 20వ వార్డు కౌన్సిలర్ యుగంధర్

తెనాలి రూరల్, మే 10: తెనాలి ప్రాంత అభివృద్ధికి, ప్రజలందరికీ సంక్షేమ పాలన అందించేందుకు ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పెమ్మసాని, నాదెండ్లను గెలిపించుకుందామని 20వ వార్డు కౌన్సిలర్ దేసు యుగంధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 20వ వార్డులో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి యుగంధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ తెనాలిలో పేరుకుపోయిన సమస్యలన్నీ పరిష్కరించుకుని ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు కూటమి ఎంపీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లను గెలిపించుకుందామన్నారు. ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి ఆశీర్వదించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ శంకర్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ పెండ్యాల వెంకట్రావు, తాత శ్రీనివాసరరావు, దర్శి ఆనంద్, కొలకలూరు వాసు, చిన్నబుజ్జి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● భట్రాజు సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయరాజు

తెనాలి రూరల్, మే 10: బీసీలపై కపటప్రేమ చూపి ఓటు బ్యాంకుగా వాడుకుని అధికారం చేపట్టాలని చూసే వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మవద్దని అందరం ఐకమత్యంగా ఉండి మన అభ్యున్నతికి పాటుబడే కూటమి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లను గెలిపించుకుందామని భట్రాజు సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజుల కాలనీలో శ్రీసత్యసాయిబాబావారి మందిరం వద్ద ఉమ్మడి రాష్ట్ర బీసీ నాయకుడు దివంగత తంగెళ్ల శేషంరాజు విగ్రహానికి భట్రాజుల సంఘం అధ్యక్షుడు లోలభట్టు గంగరాజు ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నాంజనేయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా పాలన సాగిస్తేనే అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందటం తోపాటు ఇక్కడున్న అన్నివర్గాల ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. బీసీల అభ్యున్నతికి తొలినుంచి పాటుబడింది తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్ళు గడుస్తున్న బీసీల అభ్యున్నతికి చేసిందేమీ లేదన్నారు. బీసీలు అన్నిరంగాల్లో అగ్రగాములుగా నిలవాలంటే కూటమి అభ్యర్థులైన ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కృష్ణబలిజ పూసల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కావేటి వేణుగోపాల్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లే ఈశ్వర్, బీజేపీ గీత కార్మిక రాష్ట్ర కన్వీనర్ అనుమోలు ఏడుకొండలు, టీడీపీ ఎంబీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు గుమ్మాబాలు, వడ్డెర సాధికార సమితి తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ తిరుమల కొండ వెంకటేష్, భట్రాజుల సంఘం మహిళా నాయకురాలు సరికొండ రమాదేవి, సాయిబాబా మందిర కమిటీ అధ్యక్షుడు తంగెళ్ల సత్యనారాయణరాజు, భట్రాజు సంఘం ప్రచార కమిటీ అధ్యక్షుడు భల్లం రఘునాధేశ్వరరావు, కూరపాటి ఆంజనేయరాజు, బొల్లేపల్లి సత్యనారాయణరాజు, విజయ, నందకుమారి తదితరులు పాల్గొన్నారు.





వార్డులో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రచారం చేస్తున్న దేసుయుగంధర్ తదితరులు, బీసీ నాయకుడు దివంగత తంగెళ్ల శేషంరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు